పచ్చని పైర్లతో కళకళలాడుతున్న భూములు

పెరుగుతున్న భూగర్భ జలాలు

హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

పామిడి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి గ్రామ పెద్ద, చిన్న చెరువులు నీటితో నిండడంతో ఆయకట్టు భూముల్లో పంటల సాగు జోరందుకుంది. పచ్చదనం పరచుకుంటోంది. సాగు, తాగు నీటి కష్టాలు తీరాయని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామగిరిలో 325 ఎకరాల విస్తీర్ణంగల పెద్దచెరువు, చిన్నచెరువులు ఉన్నాయి. వాటి కింద సుమారు 420 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులను నీటితో నింపేందుకు గత టీడీపీ హయాంలో హంద్రీనీవా కాలువ నుంచి కాలువ తవ్వారు. దీంతో పెద్దచెరువుకు జలకళ సంతరించుకుంది. ఏళ్లుగా కంపచెట్లు పెరిగి బీడుగా మారిన భూముల్లో పంటలు పెడుతున్నారు. కంపచెట్లతో దర్శనమిస్తున్న భూములు ప్రస్తుతం పచ్చని వరిపైర్లతో కళకళలాడుతున్నాయి. ఎత్తైన ప్రదేశంలో ఉన్న ఈ చెరువుకు నీరు రావడంతో రామగిరితోపాటు ఎగువతండా, దిగువతండా, దిబ్బసానిపల్లి, పాళ్యం, పాళ్యంతండా, ఎద్దులపల్లి, సొరకాయలపేట, కండ్లపల్లి తదితర గ్రామాల పరిధిలోని బోరుబావుల్లో భూగర్భ జలాలు పెంపొందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. తెలిపిరి, ఊటకాలువల్లో నీరు లభ్యమవుతోందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


వరి పైరుతో కళకళలాడుతున్న భూములు


నిండు కుండను తలపిస్తున్న చిన్న చెరువు

యకట్టులో

ఆనందం..

నిండిన చెరువులు.. వాటి కింద జోరుగా వరినాట్లు



మరమ్మతులకు నోచుకోని తూములు, గట్లు


చెరువు కట్టలపై ఏపుగా పెరిగిన కంపచెట్లు

రామగిరి గ్రామంలోని పెద్దచెరువు, చిన్నచెరువు తూములు మరమ్మతులకు నోచుకోలేదు. గత టీడీపీ హయాంలో చేపట్టిన చర్యలు తప్ప.. వైసీపీ పాలనలో ఐదేళ్లూ చెరువు మరమ్మతుల ఊసేలేదు. దీంతో పెద్దచెరువు తూములో నీరు లీకేజీ అవుతోంది. చిన్నచెరువు తూములో మట్టి పేరుకుపోయి పిచ్చిమొక్కలు మొలిచాయి. చెరువులు కంపచెట్లతో నిండిపోయాయి. చెరువుల వద్దకు వెళ్లేందుకు దారులు కూడా లేకుండా పోయాయి. చెరువు గట్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో గట్లకు ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దచెరువుకు వెళ్లే దారి సైతం కంపచెట్లతో మూసుకుపోయింది. ఈ కంపచెట్లు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.


తూములో పేరుకుపోయిన మట్టి, పిచ్చిమొక్కలు

బీడు భూములు సాగులోకి వచ్చాయి



చెరువు కింద ఆయకట్టులో మా భూములున్నాయి. ఏళ్లగా సాగుకు నోచుకోలేదు. కంపచెట్లతో బంజరు భూములను తలపించేవి. చెరువుకు నీరు రావడంతో కంపచెట్లు తొలగించి, వరి సాగు చేస్తున్నాం. పంట సాగు, కూలీలు, మందులు, దుక్కులకు ఇప్పటికే సుమారు రూ.15వేలు పెట్టుబడి పెట్టా. పంట దిగుబడికి మరో రూ.10వేలు ఖర్చవుతుంది. 30 బస్తాల దిగుబడి వస్తుందన్న ఆశాభావంతో ఉన్నా.

- పరమేశ్వర నాయక్, యువరైతు, రామగిరి ఎగువతండా

భూగర్భ జలాలు పెరుగుతాయి: మహానంద, రైతు, రామగిరి



చెరువులకు నీరు రాకపోవడంతో పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. భూములు బీళ్లుగా మారిపోయాయి. చెరువుకు నీరు చేరడంతో ప్రస్తుతం భూగర్భ జలాలు పెంపొందాయి. బోరుబావుల్లో నీరు వస్తోంది. మా ఊరితోపాటు చుట్టుపక్కల గల దాదాపు పది గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి.

నీరు రావడం ఆనందదాయకం

రామగిరి పెద్ద చెరువుకు నీరు రావడం ఆనందదాయకం. ఆయకట్టు రైతుల ఆవేదన తీరింది. చెరువు నిండి నెల రోజులుగా మరువ పారుతోంది. దీంతో వేసవిలో తాగునీటి సమస్య కూడా తలెత్తదు. ఆయకట్టులో ధైర్యంగా రైతులు వరినాట్లు వేసుకుంటున్నారు. మరో మూడేళ్లు పంటల సాగుకు ఢోకా ఉండదు.

- సుదర్శన్ బాబు, సాగునీటి సంఘం అధ్యక్షుడు, రామగిరి



భళా కుమారా..!

బోర్డు మార్చిన మాల్టోడెక్సిన్ విక్రేత

కల్తీ పాల వ్యవహారంలో విజిలెన్స్ తనిఖీ

దర్యాప్తు ఏమైందో.. వ్యాపారం మాత్రం సాగుతోంది



కుమార్ వారి పాత బోర్డు, ఆ బోర్డు స్థానంలో ఫ్లెక్సీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కల్తీపాల వ్యవహారం దుమారం రేపుతున్నా, మాల్టోడెక్సిన్ విక్రేత ఏమాత్రం తగ్గడం లేదు. కమలా నగర్‌లోని డీసీఎంస్ కార్యాలయం సమీపంలో ఉన్న 'కుమార్ ఎంటర్‌ప్రైజెస్' స్థానంలో 'శ్రీ హేమావతి ఎంటర్‌ప్రైజెస్' బోర్డు ఏర్పాటైంది. కుమార్ ఏజెన్సీలో చాలాకాలంగా మాల్టోడెక్సిన్ విక్రయిస్తున్నారని పాలవ్యాపారులు అంటున్నారు. చిరు వ్యాపారులు మొదలు డెయిరీ నిర్వాహకుల వరకూ చాలామంది పాలలో కలిపేందుకు ఇక్కడే మాల్టోడెక్సిన్ కొనుగోలు చేస్తుంటారని చెబుతున్నారు. బండమీదపల్లి రామిరెడ్డి డెయిరీలో విజిలెన్స్ దాడులు చేసిన తరువాత ఈ పౌడర్ వ్యవహారం చర్చనీయాంశమైంది. మాల్టోడెక్సిన్ పౌడర్, పామాయిల్, ఉప్పు కలిపిన మిశ్రమాన్ని పాలలో కలుపుతున్న విషయం వెలుగులోకి వచ్చింది.

ప్రమాదకరం..

పాడి రైతుల నుంచి సేకరించిన పది లీటర్ల పాలలో మరో పది లీటర్ల నీటిని కలిపి.. మాల్టోడెక్సిన్, ఉప్పు, పామాయిల్ మిశ్రమాన్ని అర లీటరు కలిపితే చాలు.. పాలు చిక్కగా ఉంటాయని అంటున్నారు. ఇలా కల్తీ జరుగుతున్న విషయాన్ని విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్ధారించారు. ఈ కల్తీపాలు ప్రమాదకరమని, గ్యాస్ట్రిక్, అల్సర్, కేన్సర్ సహా పలు జబ్బులు సంక్రమిస్తాయని వైద్య నిపుణులు అంటున్నారు. రామిరెడ్డి డెయిరీలో కల్తీ వ్యవహారం బయట పడిన తరువాత, మాల్టోడెక్సిన్ సరఫరా చేసిన కుమార్ ఎంటర్‌ప్రైజెస్‌ను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో నిర్వాహకులు లేకపోవడంతో రికార్డులను పరిశీలించారు. మాల్టోడెక్సిన్ లావాదేవీల వివరాలను నమోదు చేసుకుని వెళ్లారు.

బోర్డు మారింది...

కమలానగర్‌లో కుమార్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో దాదాపు 15 ఏళ్ల నుంచి వ్యాపారం నిర్వహిస్తున్నారు. మాల్టోడెక్సిన్‌ను చాలాకాలం నుంచి అక్కడే కొంటున్నామని పాలవ్యాపారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చి పాలు విక్రయించే వారి నుంచి బడా వ్యాపారుల వరకు ఈ పౌడర్‌ను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. కుమార్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో పలు రకాల పాల ఉత్పత్తులు, పశువుల దాణా, జ్యూస్ పరికరాలు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ నెల 4వతేదీ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. జీఎస్టీకి సంబంధించి సరైన వివరాలు లేవని గుర్తించినట్లు సమాచారం. మరోవైపు కల్తీపాల వ్యవహారంపై లోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ వివాదంపై వివిధ శాఖల దర్యాప్తు కొనసాగుతుండగానే కుమార్ ఎంటర్‌ప్రైజెస్ బోర్డు మారడం చర్చనీయాంశమైంది.

మామా.. ఎప్పుడు వచ్చితీవు..!


సమావేశంలో మామ దర్జా

కూడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మరుట్ల సర్పంచు లావణ్య బదులుగా ఆమె మామ నాగరాజు హాజరయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా, దర్జాగా కూర్చున్నారు. అధికారులుగాని, అధ్యక్ష స్థానంలో ఉన్న ఎంపీపీ నారాయణరెడ్డిగాని అభ్యంతరం తెలపలేదు. గత సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్లిన టీడీపీ నాయకులపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బయటకు వెళ్లాలని సూచించారు. సమావేశం జరుగుతున్నట్లు తమకు తెలియక వచ్చామని చెప్పినా ఆయన వినిపించుకోలేదు. ఈ సమావేశంలో మాత్రం తమ పార్టీకి చెందిన సర్పంచ్ బదులుగా, ఆమె మామ వచ్చి కూర్చున్నా పట్టించుకోలేదు. చట్టం సొంత పార్టీకి ఒకలా, మరో పార్టీకి ఇంకోలా ఉంటుందా..? అన్న విమర్శలు వస్తున్నాయి. పైగా మహిళలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని రిజర్వేషన్లు కేటాయించారు. ప్రజా ప్రతినిధిగా మహిళ ఎన్నికైనా.. పురుషుల పెత్తనం కొనసాగుతోంది. సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ జరగలేదు. కొందరు ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. వచ్చిన అధికారులతోనే సమావేశం నిర్వహించి.. మమ అనిపించారు. జడ్పీటీసీ తుప్పటి అశ్విని, వైస్ ఎంపీపీ దేవ, సుబ్బమ్మ, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, సీడీపీఓ శ్రీదేవి తదితరులు హాజరయ్యారు. - ఆంధ్రజ్యోతి, కూడేరు

కమిటీల్లో యువతకు ప్రాధాన్యం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): త్వరలో నియమించే పార్టీ కొత్త కమిటీలలో గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు యువతకు ప్రాధాన్యమివ్వాలని సీఎం చంద్రబాబు సూచించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తెలిపారు. విజయవాడలో సీఎంను శనివారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. సభ్యత్వ నమోదులో జిల్లాను టాప్-5లో నిలబెట్టినందుకు సీఎం అభినందించారని తెలిపారు. త్వరలో నియమించే మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలలో స్థానిక ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుని, ఆచి, తూచి పదవులను కేటాయించాలని సూచించారని తెలిపారు. పార్టీ పరంగా ప్రజలకు అధికారులు మంచి చేసేలా బాధ్యత తీసుకోవాలని సూచించారని అన్నారు. 2029 ఎన్నికల్లో పార్టీ తిరిగి అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారని అన్నారు.

సరిహద్దు దాటుతున్న బియ్యం

పట్టుకుని.. వదిలేస్తున్న పోలీసులు

పంపకాల్లో తేడాలతో పంచాయితీ


పట్టుబడిన రేషన్‌బియ్యం (ఫైల్)

ఉరవకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమ వ్యాపారం రూ.లక్షల్లో జరుగుతోంది. ఈ దందాకు కొందరు అధికారుల సహకారం అందుతోంది. బియ్యం పట్టుబడినా.. కొందరు పోలీసులు దగ్గరుండి విడిపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మూడు రోజుల క్రితం ఉరవకొండలో పట్టుబడ్డిన రేషన్ బియ్యాన్ని పోలీసులు వదిలేయడం దీనికి నిదర్శనం. ప్రతి నెలా స్టోర్‌లలో బియ్యం పంపిణీ చేయగానే.. కార్డుదారుల ఇళ్లకు వెళ్లి కొందరు బియ్యం సేకరిస్తున్నారు. కిలోకు రూ.18 నుంచి రూ.20 దాకా ఇస్తున్నారు. ఆ బియ్యాన్ని ఉరవకొండలో డంప్ చేసి, రాత్రికి రాత్రి వాహనాలలో సరిహద్దు దాటిస్తున్నారు. కర్ణాటకలోని బడా వ్యాపారులు, మిల్లర్లకు విక్రయిస్తున్నారు. అక్కడ పాలిస్ చేసి, కొత్త సంచుల్లోకి నకిలీ సన్నబియ్యాన్ని మారుస్తున్నారు. మార్కెట్లో ప్రజలకు అంటగడుతున్నారు.

నెలకు 400 క్వింటాళ్లకు పైగానే..

ఉరవకొండ కేంద్రంగా నెలకు 400 క్వింటాళ్లకు పైగా రేషన్‌బియ్యం అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నారని సమాచారం. నెల రోజుల వ్యవధిలోనే రెండుసార్లు రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మూడు రోజుల క్రితం అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ పట్టుకోగా.. వదిలేయాలని పోలీసు అధికారి ఆదేశించినట్లు సమాచారం. బియ్యం వ్యాపారుల నుంచి ముడుపులు ముట్టడమే దీనికి కారణమని అంటున్నారు. పట్టుబడిన బియ్యానికి విడిపించుకునేందుకు వ్యాపారి పోలీసు స్టేషన్‌కు వచ్చి పంచాయితీ చేయడం చర్చనీయాంశమైంది. 'మామూళ్లు ఇస్తున్నాం కదా..? అయినా మా బియ్యాన్నే పట్టుకుంటారా..?' అని రుబాబు చేసినట్లు సమాచారం. పోలీసుల మధ్య మామూళ్ల పంపకాలలో పేచీ రావడంతో వ్యవహారం పంచాయితీ దాకా వెళ్లినట్లు తెలుస్తోంది. 'ఎవరికో మామూళ్లు ఇస్తే మేము వదిలిపెట్టాలా..?' అని కొందరు పోలీసులు వ్యాపారులను ప్రశ్నించినట్లు సమాచారం. రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు.

ఉద్యోగులూ ఉపాధి కూలీలే..!

సామాజిక తనిఖీలో వెల్లడి

ఇష్టానుసారంగా నిధుల స్వాహా

మొక్కుబడిగా సాగిన ప్రజావేదిక


సామాజిక తనిఖీ బృందం సభ్యులను ప్రశ్నిస్తున్న పీడీ సలీంబాషా

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వలంటీర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వసతి గృహాల్లో పనిచేసే ఉద్యోగులను కూడా కూలీలుగా చూపి కొందరు ఉపాధి నిధులను స్వాహా చేశారు. ఈ విషయం కంబదూరు మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన 17 వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడైంది. డ్వామా పీడీ సలీం బాషా, అడిషనల్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం ప్రజావేదికను నిర్వహించారు. 2023-24 లో ఉపాధి హామీ పనులకు రూ. 6 కోట్లు, పంచాయతీ రాజ్ పనులకు రూ. 2 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ నిర్వహించారు. రూ.4.02 లక్షలు రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలి పారు. కంబదూరు మండలంలోని 12 పంచాయతీల్లో పనిచేసే కొంతమంది వలంటీర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వసతి గృహాల్లో పనిచేసే ఉద్యోగులను ఉపాధి కూలీలుగా చూపించి, మస్టర్లల్లో పేర్లు రాసి నిధులను స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించారు. ఇలా సుమారు రూ. 6 లక్షల నుంచి రూ.7 లక్షల దాకా నిధులన్నీ దుర్వినియోగం అయినట్లు ప్రజావేదికలో వెల్లడించారు. దాంతో పాటు పండ్ల మొక్కలు లేకున్నా, ఉన్నట్లుగా చూపించి నిధులన్నీ స్వాహా చేశారు. మొక్కుబడిగా ప్రజావేదిక నిర్వహించారు. వివరాలు వెల్లడించడానికి మైకు కూడా లేకుండా అక్కడకు వచ్చిన సామాజిక తనిఖీ సిబ్బందితోనే ప్రజావేదికను నిర్వహించా రు. ఒక్క ప్రజాప్రతినిధి కూడా హాజరు కాలేదు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగిన పనులన్నీ సక్రమంగా ఉన్నాయంటూ హడావుడిగా తేల్చేసి వెళ్లిపోయారు. ఉపాధిహామీ పీడీ సలీంబాషా సమక్షంలోనే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కనీసం వివరాలు వెల్లడించానికి మైకు కూడా లేకుండా చేయడం ఏమిటని రెండుమూడు సార్లు అక్కడున్న సిబ్బందిపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ కోత విధించారని అక్కడే ఉన్న ఏవో తిప్పయ్య పీడీకి సమాధానం ఇచ్చారు. కరెంట్ కోత విధిస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి, ఇలాగేనా ప్రజావేదిక నిర్వహించేది అంటూ సిబ్బందిపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. ప్రజావేదిక అంతా ఖాళీ కుర్చీలే దర్శన మిచ్చాయి. అధికారులు కూడా హడావుడిగా ప్రజావేదికను నిర్వహించి, ముగించారు. పంచాయతీ రాజ్ అధికారులు ఒక్కరు కూడా హాజరు కాలేదు. వైసీపీ హయాంలో నిర్మాణం జరిగిన సీసీరోడ్లు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సర్వశిక్ష అభియాన్ కింద సాగిన ప్రహరీలకు సంబంధించిన ఎటువంటి వివరాలు వెల్లడించలేదు. కార్యక్రమంలో ఏపీవోలు సుజాత, ఉస్మాన్ వలీ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఈ ప్రజావేదికలో పాల్గొన్నారు.

ఊరూరా మొండి గోడలు..

అర్ధంతరంగా ఆగిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణాలు

పునాదుల్లో పెరుగుతున్న కంపచెట్లు

కనిపించని నిర్మాణ సామగ్రి



ఇప్పేరులో పునాదులకే పరిమితమైన రైతు భరోసా కేంద్రం, మరుట్లలో బేస్‌మట్టానికే పరిమితమైన సచివాలయ భవనం

కూడేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో చేపట్టిన భవన నిర్మాణాలు ఊరూరా అర్ధంతరంగా ఆగిపోయాయి. కొన్ని పునాదులకు, మరికొన్ని బేస్‌మెంట్‌కు ఇంకొన్ని పునాదులకే పరిమితమయ్యాయి. సచివాలయ, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను గత వైసీపీ పాలకులు ఆర్భాటంగా చేపట్టారు. ఆ తర్వాత నిధులివ్వకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను ఆపేశారు. ఐదేళ్లూ వైసీపీ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో భవన పునాదుల్లో మొక్కలు మొలిచి, చెట్లుగా పెరిగిపోయాయి. వాటి నిర్మాణానికి సరఫరా చేసిన సామగ్రి కనిపించకుండా పోయింది. అది ఎక్కడికెళ్లిందో కూడా అధికారులు చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. మండలంలోని ఉదిరిపికొండ, మరుట్ల గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత వైసీపీ పాలనలో సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టారు. తర్వాత పాలకులు పట్టించుకోలేదు. బిల్లులు అందక పనులను కాంట్రాక్టర్లు ఆపేశారు. ఉదిరిపికొండ గ్రామంలో సచివాలయ భవన నిర్మాణం మొండిగోడలకే పరిమితమైంది. కూడేరు మండలంలో 11 సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం చేపట్టారు. అందులో మరుట్ల గ్రామంలో బెస్‌మట్టానికే పరిమితమైంది. మరుట్ల, ఇప్పేరు, ఉదిరిపికొండ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల నిర్మాణం పరిస్థితి కూడా ఇలానే ఉంది. కొర్రకోడు గ్రామంలో భవనం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలోని వివిధ గ్రామాల్లో అర్ధంతరంగా నిలిచిపోయిన భవనాల్లో కంపచెట్లు పెరిగిపోతున్నాయి.

కనిపించని కడ్డీలు, సిమెంటు


భవన నిర్మాణాలకు ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంటు, కడ్డీలు మాయమైనట్లు తెలుస్తోంది. మరుట్ల సచివాయాల నిర్మాణానికి సరఫరా చేసిన కడ్డీలు, సిమెంటు దర్జాగా స్థానిక వైసీపీ నాయకులు మాయం చేసినట్లు సమాచారం. గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు వైసీపీ నాయకుల కనుసన్నల్లో సాగాయి. వాటి కోసం సరఫరా చేసిన మెటీరియల్ మాయమైనా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. మరుట్లతోపాటు మిగిలిన గ్రామాల్లో అర్ధంతరంగా నిలిచిపోయిన భవనాలకు సరఫరా చేసిన సిమెంటు, కడ్డీలు ఎక్కడున్నాయో అధికారులకే తెలీదు. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయింది.

ప్రభుత్వానికి నివేదించాం

సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల పనులు నిలిచిపోవడంపై ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తిరిగి పనులు ప్రారంభిస్తాం.

- రమణయ్య, ఏఈ, పంచాయతీ రాజ్

లాభాల పంట



గెనసగడ్డ సాగుతో ఆదాయం

పెట్టుబడి తక్కువ.. మందులు అవసరం లేదు..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో విరివిగా సాగు

6

శ్రమిస్తే ఏదైనా సాధ్యమే

ప్రముఖ పాటల రచయిత చంద్రబోస్

ఘనంగా ఎడిఫై వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాటల రచయిత సుభాష్ చంద్రబోస్, స్కూల్ యాజమాన్యం

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమేనని ప్రముఖ పాటల రచయిత చంద్రబోస్ పేర్కొన్నారు. మండలంలోని వడియంపేట సమీపంలో ఉన్న ఎడిఫై వరల్డ్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రబోస్ హాజరయ్యారు. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రంగస్థలంలోని పాట పాడి అలరించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలను చూస్తుంటే తనకు బాల్యం గుర్తుకొస్తోందన్నారు. తాను చాలా ఇరుకు గదుల్లో చదువుకున్నానని, ప్రస్తుతం ఇలాంటి విశాలమైన పాఠశాలను చూస్తుంటే సంతోషం కలుగుతోందన్నారు. మంచి వాతావరణంలో చదువులు పిల్లల్లో ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు, సోషల్ అవేర్నెస్ కార్యక్రమాలు చేపట్టారు.కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ అగర్వాల్, సీఎండీ కామేశ్వరీ, డైరెక్టర్స్ ప్రవీణ్, నవీన్, స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు కమలానగర్‌లోని శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు మేళాలో పాల్గొంటాయన్నారు. బీటెక్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉంటుందన్నారు. వివరాలకు 90597 23829, 7569033379, 9885738299 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

హంద్రీనీవా ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



ఎస్ఈకి శుభాకాంక్షలు చెబుతున్న ఇంజనీర్లు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ఎస్ఈగా రాజా స్వరూప్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సూపరింటెండెంట్ ఇంజనీరుగా పని చేస్తున్న ఆయన్ను ఎస్ఈగా నియమిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఎస్ఈగా ఉన్న దేశేనాయక్ మూడు నెలల కిందట నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ నాగరాజ హంద్రీనీవా ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూవచ్చారు. తాజాగా వచ్చిన ఉత్తర్వులతో స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హంద్రీనీవా కార్యాలయంలో రాజాస్వరూప్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఈఈలు శ్రీనివాస్‌నాయక్, వెంకటేశ్వర్లు శెట్టి, సూపరింటెండెంట్ మల్లికార్జున, ఇంజనీర్లు, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ నుంచి ఆరుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజక వర్గం పుట్లూరు మండలం కుమ్మనమల పంచాయతీకి చెందిన ఆరుగురు టీడీపీ కార్యకర్తలను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన శీలం పెద్ది రాజు, చితంబరి, మనోహర, సూరి, చిన్న పెద్దిరాజు, సురేష్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

సమస్యలను పరిష్కరిస్తున్నా

మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి



ఇంటర్వ్యూ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనార్టీలకు సంబంధించిన అనేక సమస్యలను ఒక్కొక్కటిగా జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సహకారంతో పరిష్కరిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి అన్నారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల సమస్యలను ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, లోటుపాట్లకు తావులేకుండా న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

ప్రశ్న: బాలికల వసతిగృహంలో మెనూ ఎలా అమలు చేస్తున్నారు?

జవాబు: నేను మైనార్టీ వెల్ఫేర్‌కు రానంత వరకూ విద్యార్థినులకు నెల నెలా డబ్బులు ఇచ్చేవారు. పైస్థాయి అధికారులకు సమస్యను వివరించి మెనూ అమలు చేసేలా చర్యలు తీసుకున్నా.

ప్రశ్న: అనంతలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం ఎంత వరకూ వచ్చింది..?

జవాబు: గతంలో పాఠశాల నిర్మాణానికి రూ. 17 కోట్లు విడుదలయ్యాయి. కొన్ని కారణాల వల్ల నిధులు వెనక్కి వెళ్లడంతో పనులు ఆగాయి. ప్రస్తుతం పైస్థాయి అధికారులు నివేదికలు అడగడంతో ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఎస్టిమేషన్‌లు వేస్తున్నారు. పైస్థాయి నుంచి ఏమైనా ఆదేశాలు అందితే నిర్మాణాలు చేపడతాం.

ప్రశ్న: వసతిగృహాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారా..?

జవాబు: వసతిగృహాల్లో అన్ని రకాల వసతులు కల్పించాం. చలికాలం నేపథ్యంలో బెడ్‌షీట్లు అందజేశాం. దోమల బెడద లేకుండా మెష్‌లు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల కోసం జిల్లా కలెక్టర్‌కు ఫైలు పంపాం.

ప్రశ్న : కదిరి రెసిడెన్షియల్ పాఠశాల ఎప్పుడు ప్రారంభిస్తారు..?

జవాబు: కదిరి రెసిడెన్షియల్ పాఠశాల గతంలోనే పూర్తయ్యింది. అయితే ప్రారంభం ఆలస్యమైంది. అందుకు సంబంధించి అనుమతులు లభించాయి. త్వరలోనే ప్రారంభిస్తాం.

ప్రశ్న : గుంతకల్లు గురుకుల పాఠశాల పరిస్థితేంటి..?

జవాబు: గుంతకల్లులో అన్ని హంగులతో పాఠశాల సిద్ధంగా ఉంది. అయితే ఉపాధ్యాయుల నియామకం గురించి రాష్ట్రస్థాయి అధికారులకు వివరించాం. అక్కడి నుంచి ఆదేశాలు వస్తే ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను వినియోగంలోకి తెస్తాం.





మట్టిని తొలగించడానికి నీటి తొట్టిలో వేసిన గెనసగడ్డలు.. తరలించేందుకు కోత కోస్తున్న కూలీలు

లాభాల పంట

గెనసగడ్డ సాగుతో ఆదాయం

పెట్టుబడి తక్కువ.. మందులూ అవసరం లేదు..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో విరివిగా సాగు

కళ్యాణదుర్గం/కుందుర్పి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పంటలు సాగు చేయాలంటే రైతులు పెట్టుబడులకు భయపడిపోతున్నారు. కూలీల రేట్లు పెరిగిపోయాయి. విపరీతంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సి ఉంటుంది. మధ్యలో తెగులు సోకితే మరింతగా పిచికారీ చేయాల్సి ఉంటుంది. అన్ని వ్యయప్రయాసలకోర్చి పంట పండిస్తే.. మార్కెట్‌లో దళారుల చేతిలో దారుణంగా మోసపోవాల్సిందే. వారు చెప్పిన ధరకే పంట విక్రయించాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటితో విసిగిపోయిన కళ్యాణదుర్గం నియోజకవర్గ రైతులు గెనసగడ్డ సాగు వైపు మొగ్గు చూపారు. ఎకరాకు కేవలం రూ.5 వేలు పెట్టుబడి చాలు. రసాయన ఎరువులు, పురుగు మందులూ అవసరం లేదు. ఒకసారి కలుపు తొలగించుకుంటే చాలు. పంట తొలగించాక దళారుల అవసరం లేకుండా నేరుగా మార్కెట్‌కు తరలించి, రైతులే విక్రయించుకుంటున్నారు. అలా ఎకరాలో రూ.లక్ష ఆదాయం పొందుతున్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. వాణిజ్య పంటలు సాగుచేసి, నష్టపోయిన తాము గెనసగడ్డ పంట పెట్టి లాభాలు చూస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 200 ఎకరాల్లో పంట సాగు చేశారు.

విత్తనం కొనాల్సిన అవసరం లేదు..

కర్ణాటక ప్రాంతంలో గెనసగడ్డ సాగు చేస్తున్నారు. పైన తీగలా పెరుగుతుంది, భూమి లోపల వేర్లలో కందలా గెనసగడ్డ అభివృద్ధి చెందుతుంది. పంట పూర్తయ్యాక తీగలను తీసుకెళ్లి, మరో పొలంలో సాగు చేసుకోవచ్చు. విత్తనాల ఖర్చులు కూడా ఉండవు. ఇలా కర్ణాటక నుంచి తీగలను తీసుకొచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పంట సాగు చేస్తున్నారు. కొద్దిపాటి నీరు చాలు. డ్రిప్పు సౌకర్యంతో సులభంగా పంటను సాగు చేసుకోవచ్చు. ఏ మాత్రం మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. ఒకసారి కలుపు తొలగించుకుంటే చాలు. మూడు నెలల్లో పంట దిగుబడి వస్తుంది. ఒక్కో రైతు 4 నుంచి 5 ఎకరాల దాకా సాగు చేస్తున్నారు.

4 ఎకరాల్లో రూ.4 లక్షలు వచ్చింది



నాకున్న నాలుగెకరాల్లో గెనసగడ్డ సాగు చేశా. పంట కోసి, బెంగళూరు మార్కెట్‌కు తీసుకెళ్లి, విక్రయించా. రూ.4లక్షల వరకు ఆదాయం వచ్చింది. మరో మూడెకరాల్లో పంట సాగులో ఉంది. త్వరలోనే ఆ పంట కూడా కోతకు వస్తుంది. ఇన్నేళ్లపాటు వాణిజ్య పంటలు సాగుచేసి నష్టపోయాం, అప్పులపాలయ్యాం. గెనసగడ్డ సాగుతో లాభాలు గడిస్తున్నాం.

- శివన్న, కరిగానిపల్లి, కుందుర్పి మండలం



పచ్చదనంతో కళకళలాడుతున్న గెనసగడ్డ పంట

దళారుల బెడద అసలే లేదు..

పంట ఒకేసారి కోతకు వస్తుంది. రైతులే స్వయంగా 30 నుంచి 40 కేజీల వరకు వరకు బస్తాల్లో ప్యాక్ చేస్తారు. బెంగళూరు మార్కెట్‌కు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకుని, తరలిస్తున్నారు. దీంతో దళారుల బెడద అసలే ఉండదని రైతులు చెబుతున్నారు. ఆరోజు మార్కెట్ రేటును బట్టి విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. 30 కిలోల ప్యాకెట్లలో ప్యాక్ చేసి, బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఎకరాకు వంద ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో ప్యాకెట్ రూ.వెయ్యికిపైగానే ధరతో అమ్ముడుపోతోంది. దీంతో పెట్టుబడి రూ.5 వేలుపోను ఎకరాలో రూ.లక్ష వరకు ఆదాయం వస్తున్నట్లు అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూమికీ మేలు..

ఇన్నాళ్లపాటు వాణిజ్య పంటలు సాగు చేసి రసాయన ఎరువులు, పురుగు మందులు ఇష్టానుసారంగా పిచికారీ చేయడంతో భూసారం దెబ్బతింటోంది. ఏ పంట కూడా చేతికి అందే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో గెనసగడ్డ వైపు రైతులు మళ్లారు. ఒక్కసారి కూడా మందు పిచికారీ చేయాల్సిన అవసరం లేకపోవడంతో భూమి ఏ మాత్రం కలుషితం కావట్లేదు. సారవంతమవుతోంది కూడా. కూలీల అవసరం కూడా లేదు.

గెనసగడ్డ సాగు ఎంతో మేలు



వాణిజ్య పంటలు సాగు చేసి, నష్టపోయాం. 3 ఎకరాల్లో గెనసగడ్డ సాగు చేశా. దిగుబడి ఆశాజనకంగా ఉంది. మరో పది రోజుల్లో కోతకు వస్తుంది. అప్పుల నుంచి ఉపశమనం దక్కే అవకాశం ఉంది.

-ఈరన్న, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

11 మద్యం దుకాణాలకు 63 దరఖాస్తులు

రేపు జడ్పీ సమావేశపు హాల్‌లో లాటరీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాలకు గీత కులస్తుల దరఖాస్తు గడువు శనివారం ముగిసింది. ఇదివరకు ఈ ఏడాది జనవరి 27వతేదీ నుంచి ఈనెల 5వతేదీ వరకు గడువు ఇచ్చా రు. అప్పటి దాకా ఎవరు దరఖాస్తు చేసుకోకపోవడంతో శనివారం వరకు గడువు పొడిగించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు జిల్లాలోని 11 మద్యం షాపులకు 63 మంది గీత కులస్తులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 10న ఉదయం 9 గంటలకు జడ్పీ సమావేశపు హాల్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో లాటరీ తీస్తామని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

దరఖాస్తుల దాఖలు ఇలా..

జిల్లాలో 14 మద్య దుకాణాలను గీత కులస్తులకు కేటాయించారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో 11 మంది దరఖాస్తు చేసుకు న్నారు. గుంతకల్లు మున్సిపాలిటీలో 18 మంది, తాడిపత్రి మున్సిపాలిటీలో 1, రాయదుర్గం మున్సిపాలిటీలో 1, కంబదూరు మండలంలో 1, గుమ్మఘట్ట 1, గుత్తి మున్సిపాలిటీ 11, గుంతకల్లు రూరల్ మండలంలో 4, బెళుగుప్ప మండలం 10, రాప్తాడు మండలం 2, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో 3 దరఖాస్తులు వచ్చాయి. డి.హీరేహాళ్, రాయదుర్గం రూరల్ మండలం, గుత్తి రూరల్ మండలాల్లో ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు.

నాలుగు చోట్ల ఒక్కొక్కటే

మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజులో గీత కులస్తులకు 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో తాడిపత్రి, రాయదుర్గం మున్సిపాలిటీలు, కంబదూరు, గుమ్మఘట్ట మండలాల్లో ఒక్కో దుకాణానికి ఒక్క దరఖాస్తు మాత్రమే రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రాజకీయ నేతల ప్రోద్బలంతోనే ఈ వ్యవహారం నడిచిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణానికి ఒక్క దరఖాస్తు వేసిన వారి పేరుపై లాటరీ తీసి నిబంధనల మేరకు అన్ని సవ్యంగా ఉంటే వారికే దుకాణాన్ని కేటాయిస్తామని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.





ఆదిమూర్తినగర్‌లో మూతపడిన ఎస్సీ బాలుర వసతి గృహం

ఆదిమూర్తినగర్‌లోని దివ్యశ్రీ ఆస్పత్రి ఎదురుగా మరో చిన్నపిల్లల ఎస్సీ వసతి గృహం ఉంది. అరెకరాలో విశాలమైన భవనాన్ని ఏర్పాటు చేశారు. 400 మందికిపైగా విద్యార్థులు వసతి పొందేలా నిర్మించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న సమయంలో రెండు వసతిగృహాలను ఆ భవనంలోనే నిర్వహించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాను రాను రాష్ట్రశాఖ నుంచి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన నిధులు రాకపోవడం, చేతినుంచి ఖర్చులు పెట్టుకోలేక వార్డెన్లు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆ శాఖ అధికారులు.. వసతిగృహాన్ని ఐదేళ్ల క్రితం మూత వేశారు.

శిథిలావస్థలో సంక్షేమ వసతి గృహాలు

నిర్వహణకు నిధులు కరువు

కొత్తగా కట్టాలంటే రూ.కోట్లు కావాలి..

మూత వేసిన అధికారులు

అద్దె భవనాల్లో హాస్టళ్లు

పాతబడితే మూతే..!



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలున్నా.. ప్రైవేటు వాటిలో రూ.లక్షల్లో అద్దెలు చెల్లించి వసతిగృహాలు నిర్వహించాల్సిన దుస్థితిని సంక్షేమ శాఖలు ఎదుర్కొంటున్నాయి. ఎకరాల్లో భూములు... విశాలమైన భవంతులు ఉ న్నా ఆలనాపాలనా కరువవడంతో నిరుపయోగంగా మారిపోయాయి. పైస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలియజేస్తున్నా... అంచనాలు సిద్ధం చేసి పంపుతున్నా.. స్పందన కరువైందని జిల్లా యంత్రాంగం పేర్కొంటుండటం గమనార్హం. ఆ భవనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.కోట్లలో ఖర్చవుతుండటం, గత ప్రభుత్వాల నుంచి ఆ మేరకు స్పందన లేకపోవడంతో ఆయా సంక్షేమశాఖల రాష్ట్ర అధికారులు సైతం మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ప్రతి నెలా ఒక్కో హాస్టల్‌కు రూ.40 వేల నుంచి రూ.60 వేలకుపైగా అద్దెలు చెల్లిస్తూ ప్రైవేటు భవనాల్లో వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా బీసీ, ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు పదుల సంఖ్యలోనే మూతపడినట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనాలు ఉండి కూడా... వాటిని వినియోగంలోకి తీసుకురాలేక అద్దె భవనాల్లో ఉండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా మూతపడిన ఆయా వసతిగృహాలకు మోక్షం కలుగుతుందో.. లేదో.. చూడాలి.

ఏళ్లుగా నిరుపయోగం...

బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల పరిధిలోని పలు వసతి గృహాలు ఏళ్లుగా నిరుపయోగంగా మారాయి. ఆ భవంతుల పునఃనిర్మాణాలకు రూపాయి కూడా నిధులు రాకపోవడంతో శిథిలమైన వసతిగృహాల్లో ఉండలేక... ప్రైవేటు భవనాల్లోకి మార్చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం వెనుకవైపునున్న బాయ్స్ కాలేజీ హాస్టల్ ఐదేళ్ల క్రితం శిథిలం కావడంతో మూతవేశారు. నగర నడిబొడ్డున అదికూడా ఎకరా స్థలం... విశాలమైన భవనాన్ని అభివృద్ధి చేయలేక మూతవేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ వసతిగృహంలో 8 గదులు, లైబ్రరీ రూమ్, రీడింగ్ రూమ్, వంటశాల, డైనింగ్ హాల్, వార్డెన్ అధికారి గదితో పాటు... విశాలమైన పరిసరాలు ఉన్నాయి. ఇందులో 300 మందికిపైగానే విద్యార్థులు వసతిపొందే వెసులుబాటు ఉండేది. ఆలనాపాలనా కరువవడంతో అధికారులు మూతవేశారు.

☛ కణేకల్లులోని బాలికల వసతిగృహాన్ని నాలుగేళ్ల క్రితం మూతవేశారు. గతంలో మెయింటెనెన్స్ ఫండ్ కోసం రాష్ట్రశాఖకు జిల్లా అధికారులు కుప్పలుతెప్పలుగా నివేదికలు పంపినా... చెత్తబుట్టకు పరిమితమయ్యాయనడంలో సందేహం లేదు. ఆ క్రమంలోనే ఆ వసతిగృహాన్ని మూతవేసి అందులో ఉన్న విద్యార్థినులను స్థానికంగా పలు బీసీ, ఎస్సీ, మోడల్ స్కూళ్లకు పంపినట్లు తెలుస్తోంది. ఈ వసతిగృహం దాదాపు అరెకరం విస్తీర్ణంలో ఉంది. విద్యార్థుల వసతి కోసం 9 గదులు, వంటశాల, డైనింగ్, రీడింగ్ రూములు మరో నాలుగు గదులు నిర్మించారు. పైకప్పు పెచ్చులూడటం, వర్షాలు కురిసిన సమయం లో నీరు వసతిగృహంలోకి ఉట్టిపడుతుండటంతో ఆ శాఖ అధికారులు మూతేశారు.

☛ గుత్తిలో ఆరేళ్ల కిందట రెండు బాలుర వసతి గృహాలను మూతేశారు. మూడేళ్ల కిందట బాలికల కాలేజీ వసతిగృహం పూర్తిగా శిథిలమవడంతో క్లోజ్ చేశారు. గుత్తి నడిబొడ్డున ఉన్న ఆ వసతిగృహం ఆలనాపాలనా కరువవడంతో మూతేశారు. అందులో ఉన్న విద్యార్థినులను పలు వసతిగృహాల్లోకి పంపినట్లు తెలిసింది. ఈ వసతిగృహం దాదాపు అరెకరం విస్తీర్ణంలో ఉంది. 7 వసతి గదులు, విశాలమైన పరిసరాలతో ఏర్పాటైన వసతిగృహం మూతపడింది.

☛ మరూరులోని బీసీ వసతిగృహం ఆరేళ్ల కిందట విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని మూతేశారు. దీంతో ఆ భవనం శిథిలావస్థకు చేరిపోయింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో... ఆ ప్రాంత ప్రజల నుంచి హాస్టల్‌ను పునఃనిర్మించాలని డిమాండ్ వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ☛ యాడికిలోని బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. ఐదేళ్ల క్రితం భవనం శిథిలావస్థకు చేరుకున్నపుడు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో మూత వేయాల్సి వచ్చింది.

☛ గుత్తిలోని మరో బాలికల వసతిగృహం మూతపడింది. ఆ హాస్టల్‌ను తెరవాలని సమీప ప్రాంత ప్రజల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని రాష్ట్రసాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యమనే చెప్పాలి.

రూ.కోట్లల్లో ఖర్చవుతుండటమే కారణం

బీసీ, ఎస్సీ సంక్షేమశాఖల పరిధిలో మూతపడిన ప్రభుత్వ భవనాలకు మరమ్మతులు చేయాలన్నా, వాటిని పడగొట్టి కొత్తవి నిర్మించాలన్నా రూ.కోట్లల్లో ఖర్చవుతుండటంతోనే రాష్ట్ర అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని రెండు ఎస్సీ వసతిగృహాలకు మరమ్మతులు చేయాలన్నా, కొత్తవి నిర్మించాలన్నా రూ.5 కోట్ల వరకూ ఖర్చయ్యే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులే పేర్కొంటున్నారు. ఈ లెక్కన గుత్తి, కణేకల్లులోని వసతిగృహాలకు సైతం పూర్వవైభవం తీసుకురావాలంటే రూ. 2 కోట్ల వరకూ ఖర్చవుతుందని తెలుస్తోంది. మరూరు, యాడికి, గుత్తిలోని బీసీ వసతిగృహాలకు మరమ్మతులు చేయాలంటే రూ.5 కోట్ల వరకూ వెచ్చించాల్సిన ఉందట. అంత మొత్తంలో నిధులు ప్రభుత్వం నుంచి రాబట్టే సాహసాన్ని ఆ శాఖ రాష్ట్ర అధికారులు చేయలేకపోతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో... శిథిలమైన భవనాలు మూతవేసి విద్యార్థులను అడ్జస్ట్‌మెంట్‌తో సరిపెడుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే... వారి కోసం ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



ఎస్సీ సంక్షేమ శాఖ వెనక వైపు మూత పడిన ఎస్సీ బాలుర వసతి గృహం

స్టాంపు వెండర్ల మాయాజాలం..!

రూ.100 స్టాంపు రూ.200కు విక్రయం

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కనిపించని స్టాంపులు



అనంతపురం క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. రూ.100 స్టాంపును రూ.200కు విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల అది ఇంకా పైచిలుకే పలుకుతోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలో స్టాంపు వెండర్లు మాయాజాలం చేస్తున్నారు. ఈ స్టాంపులున్నా ఎక్కువ మంది నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వైపే మొగ్గు చూపుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ స్టాంపుల విధానం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పూర్తిగా పక్కన పెట్టేశారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు దొరకడం లేదు. బయట మాత్రం రెట్టింపు ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలిసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొందరు పాత తేదీల కోసం ఈ స్టాంపులను రహస్యంగా ఉంచుకుంటారు. అవసరమైన వారికి రూ.వేలల్లో చెప్పి అమ్మేస్తుంటారు. అందుకే ఈ స్టాంపులకు మరింత డిమాండ్ ఉంటుంది.

నెలన్నరలో రూ.40 లక్షల స్టాంపులు...

రెండు నెలల క్రితం సుమారు రూ.40 లక్షల విలువైన రూ.50 ముఖ విలువ, రూ.100 ముఖ విలువ కలిగిన స్టాంపులు వచ్చాయి. జిల్లాలోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వాటిని పంపించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టాంప్ వెండర్లకు అందజేశారు. నెలన్నర వ్యవధిలోనే అవన్నీ పూర్తయ్యాయని చెబుతున్నారు. ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోనూ రూ.50, రూ.100 స్టాంపులు దొరకడం లేదు. కేవలం స్టాంపు వెండర్ల వద్ద మాత్రమే ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా స్టాంపుల కోసం వెళ్తే రూ.50 స్టాంపులు రూ.100కు, రూ.100 స్టాంపులు రూ.200కు విక్రయిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సమీపాల్లోనే ఇలా అమ్ముతున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఇంకా రూ.10, రూ.20 ముఖ విలువ కలిగిన స్టాంపులు రానే లేదు. మరోసారి ఇండెంట్ పంపినట్లు చెబుతున్నారు. మరోసారి స్టాంపులు రావడానికి ఇంకా వారం నుంచి పది రోజుల సమయం పట్టే అవకాశముంది.

స్టాంపువెండర్ల ఇష్టారాజ్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ-స్టాంపుల మీదే ఆధారపడాల్సి వచ్చేది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ఉండేవి కావు. గతంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లభ్యమైనంత కాలం స్టాంపు వెండర్లదే హవా. కొంతకాలం క్రితం వరకు డాక్యుమెంట్ల కోసం స్టాంపులను ఉపయోగించేవారు. వీటికి భారీగానే వసూలు చేసేవారు. ఇప్పుడు కూడా అదే క్రమంలో స్టాంపు వెండర్లు నాన్ జ్యుడీషియల్ స్టాంపులను వాడేస్తున్నారు. అధిక ధరలకు విక్రయించేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లేవనే సాకుతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. స్టాకు రాగానే ఎక్కువ స్టాంపులు తమకే అందేలా వ్యవహారం నడుపుతారు. అందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ముడుపులు అప్పగించి సొంతం చేసుకుంటున్నారని సమాచారం. త్వరలో రానున్న స్టాంపుల విషయంలోనైనా అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోతే అధిక భాగం స్టాంపు వెండర్ల చేతిలోకి వెళ్లడం ఖాయం.



రామ్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం రూరల్ మండలంలోని విద్యారణ్యనగర్‌లో యూపీ స్కూల్ ఉంది. ఇందులో 1 నుంచి 5వ వరకూ 95 మంది విద్యార్థులు, 6,7,8 క్లాసుల్లో 84మంది విద్యార్థులున్నారు. 117 ప్రత్నామ్నాయ నిబంధనల మేరకు విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువ ఉన్నట్లైతే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలి. కానీ వసతులు లేవన్న కారణాలు చూపి ఈ స్కూల్‌ను కాదని సమీపంలోని పాపంపేట స్కూల్‌లో కొన్ని టీచర్ పోస్టులు కాపాడేందుకు ఇక్కడి 84 మంది విద్యార్థులను రోడ్డు దాటించి పాపంపేట స్కూల్‌లో కలపాలని చూస్తున్నారు. యూపీ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు పిటిషన్ ఇచ్చినా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

మిగిలేవి ఎన్నో..?

స్కూళ్లకు కొత్త రూపమా...శాపమా..?

పాఠశాలలు, పోస్టుల పునర్నిర్మాణం

117 రద్దుకు కూటమి సర్కారు శ్రీకారం

'ప్రత్యామ్నాయం' పేరుతో పునర్నిర్మాణానికి కసరత్తు

ఐదు రకాలుగా పాఠశాలల వర్గీకరణ

యూపీ స్కూళ్లు, సబ్జెక్టు టీచర్లకు దెబ్బ : సంఘాల నేతలు

స్కూళ్లను దెబ్బతీసేలా నిర్ణయం

ప్రస్తుతం విద్యాశాఖ నిర్ణయాల వల్ల ప్రధానంగా అప్పర్ ప్రైమరీ స్కూళ్లు చాలా వరకూ దెబ్బ తింటాయన్న అభిప్రాయం మెజార్టీ టీచర్ల నుంచీ వస్తోంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఇదే జరిగితే భవిష్యత్తులో విద్యార్థుల డ్రాపౌట్లు కూడా పెరుగుతాయని సామాన్య టీచర్లు విద్యాశాఖ తీరుపై మండిపడుతున్నారు. స్కూళ్లను నాడు జగన్ ఒక రకంగా దెబ్బతీస్తే... నేడు కూటమి ప్రభుత్వం మరో రకంగా దెబ్బతీసేలా ఉందంటూ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మా పోస్టు ఉంటుందా? ఊడుతుందా..? ఉన్న స్కూల్ అలాగే ఉంటుందా...? అప్‌గ్రేడ్ అవుతుందా..? లేక డీగ్రేడ్ అవుతుందా..?, రాష్ట్రవ్యాప్తంగా టీచర్లు, ప్రధానోపాధ్యాయుల్లో ఇప్పుడు ఇదే చర్చ. స్కూళ్లు, పోస్టులు ఉండేనా, ఊడేనా అంటూ ఎవరి స్థాయిలో వారు గందరగోళానికి గురవుతున్నాయి. గతంలో జగన్ ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చింది. దీనిపై టీచర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో కూటమి సర్కారు 117 రద్దుకు నడుం బిగించింది. విద్యాశాఖ జీవో 117 రద్దు చేస్తూ అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. క్షేత్రస్థాయిలో స్కూళ్ల స్వరూపాలను మార్చేందుకు 117 ప్రత్నామ్నాయ ఏర్పాట్ల పేరుతో ప్రాథమిక కసరత్తు మొదలెట్టింది. గత 15 రోజులుగా ప్రాథమిక కసరత్తు చేసి, ఓ కొలిక్కి తెచ్చారు. జగన్ ప్రభుత్వం 117 తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను దెబ్బతీస్తే, కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేసే నెపంతో యూపీ స్కూళ్లను దెబ్బతీస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సర్‌ప్లస్‌గా చూపి ఎస్జీటీలను అవసరం ఉన్నట్టుగా చూపే యత్నాలు సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కసరత్తు ముమ్మరం

గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 117ను రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో విద్యాశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమైంది. జనవరి నెలలో విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులిచ్చారు. గత నెల 24న జిల్లా పర్యటనకు వచ్చిన డైరెక్టర్ స్కూళ్ల పునర్నిర్మాణంపై దిశానిర్దేశం చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యాశాఖాధికారులు, ఐటీ సెల్ స్టాఫ్ గత 15 రోజులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. మొదట స్కూళ్లలోని బోగస్ రోల్ ఏరివేతకు నడుం బిగించారు. 2024 డిసెంబరు 31నాటికి స్కూళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూళ్ల పునర్నిర్మాణంపై కసరత్తు చేస్తున్నారు. కొత్త తరహా స్కూళ్ల ఏర్పాటుకు ప్రాథమికంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, మోడల్ ప్రైమరీ స్కూళ్లు, యూపీ స్కూళ్లు, హైస్కూళ్లుగా వర్గీకరించుకుని వాటికి సరిపడా టీచర్లు, విద్యార్థుల వివరాలను రూపొందిస్తున్నారు. ప్రాథమికంగా అంచనా ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రతిపాదనల ముసాయిదాను సిద్ధం చేసి త్వరలో కలెక్టర్ ముందు ఉంచనున్నారు. తర్వాత కలెక్టర్ అన్ని మండలాల వారీగా పరిశీలించనున్నారు. ప్రజా ప్రతినిధులు నుంచి కూడా స్కూళ్ల పునర్నిర్మాణంపై అభిప్రాయం తీసుకోనున్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే....మార్పులు చేర్పులు చేయించి, తర్వాత ప్రతిపాదనలను విద్యాశాఖ ఆమోదానికి పంపనున్నారు.



విద్యారణ్యనగర్ యూపీ స్కూల్

స్కూల్ టైప్	కొత్త స్కూళ్ల సంఖ్య
ఫౌండేషన్ స్కూళ్లు	127
బేసిక్‌ప్రైమరీ	584
మోడల్ ప్రైమరీ	644
యూపీస్కూళ్లు	23
హైస్కూళ్లు	271

కలెక్టర్‌కు త్వరలో ప్రతిపాదనలు



విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 117జీవో రద్దు తర్వాత ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా కసరత్తు జరుగుతోంది. ఇదే ఫైనల్ కాదు. ప్రాథమికమైన పని మాత్రమే. గత డిసెంబరు 31 రోల్ ఆధారంగా స్కూళ్ల ప్రతిపాదనల డ్రాఫ్ట్ సిద్ధం చేస్తున్నాం. ఒకటి లేదా రెండు రోజుల్లో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

డ్రాపౌట్లు పెరిగే ప్రమాదం



విద్యార్థుల సంఖ్య 60కి పైగా ఉన్న అప్పర్‌ప్రైమరీ స్కూళ్లను హైస్కూళ్లుగా, 60కి తక్కువ ఉంటే బేసిక్ ప్రైమరీగా మారుస్తున్నారు. పైగా 3,4,5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కలపడం వల్ల దూరంగా ఉండే స్కూళ్లకు వెళ్లలేక డ్రాపౌట్లు పెరిగే ప్రమాదం ఉంది. 5వ తరగతి పూర్తయిన తర్వాత మూడు, 5 కిలోమీటర్లు దూరం వెళ్లేందుకు విద్యార్థులు సుముఖత చూపరు. యూపీ స్కూళ్లను కొనసాగించడంతోపాటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని ఏపీటీఎఫ్ తరపున డిమాండ్ చేస్తున్నాం.

- సిరాజుద్దీన్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

విద్యార్థులకు ఇబ్బందే



రెండు, మూడు గ్రామాలకు ఒక పాఠశాల పెట్టడం వల్ల ప్రాథమిక విద్యార్థులు వెళ్లలేక ఇబ్బందులు పడతారు. గ్రామీణ విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదమూ ఉంది. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో టీచర్లు ఎక్కువగా పెట్టడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆశిస్తున్నాం. మరోవైపు విద్యార్థులకు రవాణా వ్యయం అందిస్తామంటున్నారు. ఇది అమలు చేయడంలో అనేక అవాంతరాలు ఏర్పడతాయి. విద్యాశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలి.

- బీరప్ప, బీసీటీఏ, రాష్ట్ర అధ్యక్షుడు

జీవో 117 విద్యావ్యవస్థకు క్యాన్సర్

గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 విద్యా వ్యవస్థకు క్యాన్సర్ వంటిది. ఇది విద్యా వ్యవస్థను పూర్తిగా తినేసింది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం రద్దు చేస్తామని చెప్పి...ప్రత్యామ్నాయ చర్యలు అంటున్నారు. ఇది ఒక రకంగా గాయాలకు మందు పూయడం వంటిదే. కొత్త ప్రభుత్వం విద్యాశాఖను గాడిన పెట్టాలనుకుంటే జీఓ 117ను పూర్తిగా రద్దు చేయాలి. అదేవిధంగా పూర్వపు ప్రైమరీ, యూపీ హైస్కూల్ విధానాన్ని అమలు చేయాలి.

- ఒంటేరు శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు



దత్తతత్వం అందరికీ అర్థం కాదు

మైసూరు దత్తపీఠం ఉత్తరోత్తర పీఠాధిపతి విజయానందతీర్థ స్వామీజీ


అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామి

పామిడి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దత్తతత్వం అందరికీ అర్థం కాదని, త్వరగా ఎవరికీ బోధపడదని మైసూరు దత్తపీఠం ఉత్తరోత్తర పీఠాధిపతి విజయానందతీర్థ స్వామీజీ పేర్కొన్నారు. పట్టణంలోని అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ముందుగా అనఘా ఆత్రేయ దత్తుడికి, కార్యసిద్ధి వినాయకుడికి విశేష పూజలు నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాల మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఉపన్యసించారు. జ్ఞానమూర్తి, సీతమ్మ దంపతుల కృషి ఫలితంగానే పామిడిలో దత్త క్షేత్రం ఏర్పాటు అయ్యిందన్నారు. దత్తుడికి పరీక్షలు పెట్టడం ఇష్టం.. ఆ పరీక్షల్లో భక్తులను గెలిపించడం ఎంతో ఇష్టమన్నారు. అదే దత్తతత్వమన్నారు. ఎక్కడా లేని విధంగా పామిడి దత్త క్షేత్రంలో నవగ్రహాలు సతీసమేత వాహన రూపంలో ప్రతిష్ఠించడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ నవగ్రహాలతో గ్రహ బాధలు, గ్రహ దోషాలు ఉండవన్నారు. ప్రతి భక్తుడు ధార్మికతను, ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు. భగవద్గీత పఠనం అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహకులు శ్రీధర్, ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీరాములు, నారాయణస్వామి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ చేసిన ముఠా అరెస్ట్

3 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

రాప్తాడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి, డబ్బు కోసం ఆలయాల్లో చోరీ చేసే వారిని అరెస్ట్ చేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాప్తాడులోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం కురుగుంట్లకు చెందిన కూరుపాటి సాయికుమార్, అక్కంపల్లి గ్రామానికి చెందిన కనుముక్కల చాంద్‌బాషా, ఎ. నారాయణపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్‌సర్దార్‌వలి, బళ్లారి బైపాస్ ఎల్‌బీ నగర్‌కు చెందిన భగవన్ సాదిక్‌బాషాలు ముఠాగా ఏర్పడి దేవాలయాల్లో దేవుళ్ల ఆభరణాలు దొంగలించేవారని తెలిపారు. శింగనమల చెరువు వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో, దుర్గమ్మ దేవాలయంలో, గురుగుంట్ల చౌడేశ్వరి ఆలయంలో, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోల్లపల్లి గంగమ్మ దేవాలయంలో, పి. యాలేరు గ్రామంలోని అక్కమ్మ దేవాలయంలో, నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామంలోని కుంటాలమ్మ దేవాలయంలో దేవుళ్లకు అలంకరించిన పలు రకాల ఆభరణాలు చోరీ చేశారన్నారు. ఇలా దాదాపు 3 కిలోల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అందిన ఫిర్యాదుల మేరకు నిందితుల కోసం గాలించామన్నారు. కాగా నిందితులు శనివారం లోలూరు క్రాస్ వద్ద శ్రీరామ్ ఆటో ఫైనాన్స్ గోడౌన్ పక్కన ఉండగా శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్ కుమార్, గార్లదిన్నె, నార్పల పోలీస్ సిబ్బంది చాకచక్యంగా దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి మూడు కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నా మన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం జిల్లా : ఫిబ్రవరి 9: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్సనందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలా నగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమరెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

చీనీ టన్ను రూ. 21వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 10వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైతుల మధ్య భూ వివాదం

దుక్కి చేస్తుండగా వాగ్వాదం...పురుగుల మందు తాగిన ఓ రైతు


విలపిస్తున్న కుటుంబసభ్యులు, ఇన్‌సర్ట్‌లో స్పృహతప్పి పడిపోయిన శివ

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య భూ వివాదం కారణంగా ఒక రైతు పొలంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. సీకే పల్లి మండలం న్యామద్దలలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, న్యామద్దలకు చెందిన రాము పేరిట సర్వే నంబరు 403-3ఏలో 3-12 ఎకరాలు, 403-5ఏలో 1-28 ఎకరాలు ఉంది. అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యంకు 403-3బీ, 403-5బీ సర్వే నంబర్లలో 4.50 ఎకరాల భూమి ఉంది. ఎవరి భూములను వారు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. కానీ, రాము సాగు చేస్తున్న భూమి సుబ్రమణ్యందని, సుబ్రమణ్యం సాగు చేస్తున్న భూమి రాముదని కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో రాము సోదరుడు శివ ట్రాక్టర్‌తో శనివారం దుక్కి చేస్తుండగా, సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. శివ పొలంలోనే పురుగులమందు తాగాడు. అక్కడ ఉన్నవారు అడ్డుకుని పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న శివను కుటుంబ సభ్యులు సీకే పల్లి ప్రభుత్వ ఆస్రత్రికి తరలించారు. బంధువులు, కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున ఆస్పత్రి వద్దకు వచ్చారు. సరిగా వైద్యం చేయలేదని డ్యూటీ డాక్టర్ జీవన్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. పొలంలో శివ విషం తాగాడని, కానీ డాక్టర్ తాగలేదని అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి భూ వివాదం గురించి స్థానికులను విచారించారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదు స్వీకరించామని, విచారించి చర్యలు తీసుకుంటామని రామగిరి సీఐ శ్రీధర్ తెలిపారు.

జనగణన కాదు.. కుల గణన చేయాలి: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు డి. జగదీశ్

గుంతకల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణన కంటే కుల గణన చేపట్టాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ అన్నారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణలో కులగనణ పూర్తిచేసి, ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చారని అన్నారు. కుల గణన వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కుల గణన వల్ల అణగారిని కులాలు, కుల వృత్తుల వారి గణాంకాలు తెలుస్తాయని, వాటి ఆధారంగా సంక్షేమ పథకాలను వర్తింపజేయవచ్చని అన్నారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపు ద్వారా వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించాలని అన్నారు. కుల గణన విషయంగా ప్రజలకు అవగాహన కలిగించడానికి ఈ నెల 12న సీపీఐ ఆధ్వర్యంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, గోపీనాథ్, మహేశ్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కనగానపల్లి/రాయదుర్గం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రెండు ప్రాంతాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతిచెందగా, ఒకరు గాయపడ్డారు.

కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుంతకల్లుకు చెందిన శివ(28) మృతిచెందాడు. బంధువుల పెళ్లికి బైక్‌పై తల్లిమడుగులకు వస్తుండగా, శుక్రవారం రాత్రి మామిళ్లపల్లి వద్ద పెట్రోల్ అయిపోయింది. దీంతో దాదులూరు సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి పెట్రోల్ తీసుకువస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ శివ అక్కడే మృతిచెందాడు. కనగానపల్లి ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాయదుర్గం శివారులోని పైతోట వద్ద శనివారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాయదుర్గం పట్టణానికి చెందిన షేక్ ఇబ్రాహీం(48) మృతి చెందాడు. కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి రాయదుర్గం వైపు వస్తున్న ఆటోకు కుక్క అడ్డు వచ్చింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. డ్రైవర్ ఇబ్రహీం తీవ్రంగా గాయపడగా, ప్రయాణికుడు రెహమాన్ స్వల్పంగా గాయపడ్డాడు. వీరిని రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ఇబ్రహీం మృతిచెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

902 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 902 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 463 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.





న్యూస్ బాక్స్

ఘనంగా శంకరమఠం వార్షికోత్సవాలు


అలంకరణలో శారదామాత

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మఠంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. శారదామాత మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అదే విధంగా గణపతి, శంకరాచార్యుల మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు చేశారు. హోమానంతరం అన్నదానం చేశారు. మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామి నిజపాద స్పర్శ దర్శనం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శనివా రం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద స్పర్శ దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విరివిగా హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ అర్బన్ కార్యాలయంలో గ్రీవెన్స్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మశాలి, రజక, నాయీబ్రాహ్మణ, వాల్మీకి కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహు లు, పరమేశ్వరన్, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నగరంలోని పలు కాలనీల నుంచి వచ్చిన ప్రజలు రోడ్లు, డ్రైనేజీ, చెత్త సమస్యలతో పాటు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని అర్జీలు సమర్పించారు. ఎమ్మెల్యే దగ్గపాటి వెంకటేశ్వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేలా చూస్తామని డైరెక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు డిష్ నాగరాజు, సంగా తేజస్విని, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

12న డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల పంపిణీ

రాప్తాడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో జాతీయరహదారి పక్కన బెల్లం టీ కేఫ్ వద్ద ఈనెల 12న ఉదయం 9 గంటలకు రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా పంపిణీ చేస్తామని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పంపిణీ కార్యక్రమం వేదిక స్థలాన్ని శనివారం టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళితో కలిసి పరిశీలించారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో 840 మంది రైతులకు 1129 హెక్టార్లలో సాగుకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూ రయ్యాయన్నారు. ఈ నెల 12న ఎమ్మెల్యే వాటిని మంజూరైన రైతులకు పంపిణీ చేస్తారన్నారు. రైతులందరూ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ సాకే తిరుపాలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ బాలాజీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రుద్రంపేట సమీపంలోని శ్రీ బాలాజీ ఎంబీఏ కళాశాలలో ఈ నెల 11వ తేదీన ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. హైదరాబాద్‌లోని డి-మార్టు కంపెనీలోని హెచ్ఆర్ మేనేజర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ. 3 లక్షల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు బయోడేటాతో పాటు ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్లతో కళాశాలలో ఉదయం 7గంటలకు హాజరుకావాలన్నారు.

హెల్మెట్ ధరించాలి: ఎస్‌ఐ

గార్లదిన్నె, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా వాహనదారులకు సూచించారు. ఆయన శనివారం సాయంత్రం కల్లూరు, గార్లదిన్నె, తలగాసిపల్లి జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలను పాటిస్తూ ప్రాణాలను రక్షించుకోవాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్సీ కమిషన్ సభ్యుడు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తండాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఎస్టీ కమిషన్‌సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని మేకేనాయక్‌తండాను శనివారం అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ప్రధానంగా ఇంటింటికి తాగునీటి కొళాయిలు, సీసీరోడ్లు, పక్కాగృహాలు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని తండావాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు

గొర్రె పిల్లల గుడిసెకు నిప్పు

● ఆరు మృతి, గాయపడిన ఇరవై పిల్లలు

రామగిరి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమేకలపల్లిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెపిల్లల గుడిసెకు నిప్పుపెట్టారు. దీంతో శనివారం ఆరు గొర్రె పిల్లలు బుగ్గిపాలు కాగా దాదాపు 20కి పైగా గాయాల పాలయ్యాయి. గరిమేకలపల్లికి చెందిన జనార్దన అనే కాపరి తన గొర్రెపిల్లలను గ్రామసమీపంలోని గుడిసెలో వేసి గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. ఆ సమయంలో ఎవరో పిల్లలున్న గుడిసెకు నిప్పు అంటించడంతో ఆరు పూర్తిగా కాలిపోగా దాదాపు 20కి పైగా గాయపడ్డాని బాధిత జనార్దన తెలిపాడు. ఎవరో ఉద్దేశ్య పూర్వకంగానే ఈ ఘాతకానికి పాల్పడ్డాడని వాపోయాడు. ఈ విషయంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

గడ్డివామి దగ్ధం

రామగిరి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయ్యగారి కొట్టాల గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివామి, పైపులు కాలిపోయాయి. గ్రామానికి చెందిన చిన్నవరద అనే రైతు గ్రామం సమీపంలో రెండు ట్రాక్టర్‌ల గడ్డివామి వేసుకు న్నాడు. అక్కడే 30 పీవీసీ పైపులు ద్విచక్రవాహనం టైర్లు ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంవల్ల గడ్డివామితో పాటు పైపులు, టైర్లు కాలిపోయాయని బాధితుడు వాపోయారు. దీంతో రూ. 50వేల వరకు నష్టం వాటిల్లినట్టు తెలిపాడు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

నిండా నిర్లక్ష్యం..!

● పలు చోట్ల ప్రమాదకర స్థితిలో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
● పట్టించుకోని విద్యుత్ అధికారులు


ఎస్సీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఒరిగిన స్తంభం


మరో చోట విద్యుత్ లైన్‌ను తాకుతున్న తీగలు


ఆంజనేయస్వామి గుడి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ముళ్లకంపలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖకు నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుంది. మండల పరిధిలోని మన్నిల పంచాయతీలో నెలకొన్న విద్యుత్ పరమైన సమస్యలే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో చేతికందేంత ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన చోట విద్యుత్ స్తంభం దెబ్బతిని ఒక వైపు వాలిపోయింది. విద్యుత్ లైన్లను ఇళ్ల మీదుగా లాగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకుకొస్తుందన్న భయం స్థానికుల్లో నెలకొంది. ఇదిలా ఉండగా ఎస్సీ కాలనీలోనే త్రీఫేస్ లైన్ స్తంభం కూడా ఇదే పరిస్థితిలో ఉంది. స్తంభం దెబ్బతిని, విరిగిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు విరిగి జనం మీద పడుతుందోన్న భయం స్థానికులకు పట్టుకుంది. అదే విధంగా గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక భాగంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడు కారణంగా చెడిపోయి ఏడాది అవుతోంది. స్థానికంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారుగానీ, పాతదానిని తొలగించలేదు. ప్రస్తుతం పనిచేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు లోడ్ ఎక్కువై తరచూ విద్యుత్ పరమైన సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు ఆ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లకంప లు పెరిగిపోయాయి. చెట్లు, తీగలు దానికి అల్లుకుపోయాయి. సంబంధిత ఉద్యోగులు వాటిని పట్టించుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామంలో నెల కొన్న విద్యుత్ పరమైన సమస్యలపై కొన్ని నెలలుగా విద్యుత్ అధికారులకు తెలియ జేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గొందిరెడ్డిపల్లి వద్ద ఉన్న ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఎలైట్ బయో టెక్నాలజీస్ ల్యాబ్‌లో అరటి మొక్కల తయారీని ఆమె శనివారం ఏపీఐఐసీ అధికారులతో కలిసి సందర్శించారు. అరటి మొక్కలు తయారీ విధానం, అవి రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతుందన్న అంశా ల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న పారిశ్రామిక వేత్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ 50 ఎకరాల్లో ఉండగా...అందులో 26 ఎకరాలు వినియోగంలో ఉందని వారు తెలిపారు. 319 ప్లాట్లు వేశారని, 239 ప్లాట్లు వినియోగిస్తున్నామన్నారు. పరిశ్రమలు నడిపేందుకు ప్రధానంగా నీరు, విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఐలా అమోదం ఏడాది నుంచి పెండింగ్‌లో ఉందని పంచాయితీరాజ్ విభాగంలో ఈ ఫైల్ ఉందని తెలిపారు.రామినేపల్లి నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ వరకూ 80 అడుగుల తారురోడ్డు నిర్మించాలన్నారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలి పారు. ఇక్కడ మరో ఇండస్ట్రియల్ పార్క్ వచ్చేలా చూస్తామన్నారు. ఇండస్ట్రియల్‌లో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే పారిశ్రామిక వేత్తలకు తెలిపారు. కార్యక్రమంలో రాప్తాడు, ఆత్మకూరు మండలాల ఇన్‌చార్జ్‌లు ధర్మవరపు మురళి, బాలాజి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎంపీటీసీ జాఫర్, సర్పంచులు శీనయ్య తిరుపాలు, వాటర్‌షెడ్ ఛైర్మన్ మల్లి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఎప్పటికీ జీరోనే: స్వామిదాస్


మాట్లాడుతున్న స్వామిదాస్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, కోట్లాది రూపాయల అక్రమార్జనకు పాల్పడిన జగన్ ఎప్పటికీ జీరోనే అని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ అర్బన్ టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని 30 సంవత్సరాలు వెనక్కినెట్టాడని మండిపడ్డారు. పార్టీ కీలక నేతలు వలస వెళ్తుండ డంతో క్యాడర్‌ను కాపాడుకోలేక జగన్ మతిభ్రమించి కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. మనిషికి విషం ఎంత ప్రమాదమో, జగన్‌రెడ్డి పాలన ప్రజలకు అంతే ప్రమాదమన్నారు. జగన్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలకు కాలం చెల్లిందని, ఆయన మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు

● సుప్రీంకోర్టు న్యాయవాది షర్మిల ఉపాధ్యాయ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని...ఇది ప్రతి ఒక్కరూ గ్రహించిన రోజే మరిన్ని ప్రయోజనాలు పొందుతారని సుప్రీంకోర్టు న్యాయవాది షర్మిల ఉపాధ్యాయ పేర్కొన్నారు. స్థానిక కమ్మభవన్‌లో శనివారం రీజనల్ రూరల్ బ్యాంకు వెల్ఫేర్ సొసైటీ జాతీయ స్థాయి కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు న్యాయవాది షర్మిల ఉపాధ్యాయ మాట్లాడుతూ... ఏదైనా సరే కలిసిమెలిసి వెళితేనే పటిష్ట ఫలితాలు సాధిస్తామని తెలిపారు. రీజనల్ రూరల్ బ్యాంకు వెల్ఫేర్ సొసైటీ జాతీయ స్థాయి కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి, గౌరవాధ్యక్షుడు రవీంద్రనాథ్ త్రిపాఠి మాట్లాడుతూ... గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ఆదేశాల మేరకు 1993 నవంబరు నుంచి పెన్షన్ ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. అనంతరం సుప్రీం కోర్టు న్యాయవాది షర్మిల ఉపాధ్యాయ, రాజారెడ్డి, రవీంద్రనాథ్ త్రిపాఠిలతో పాటు జాతీయ కమిటీ కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల జాతీయ కమిటీ సభ్యులు రాము, శివశంకర్ రెడ్డి, నరసింహులు, ప్రభాకర్ రెడ్డి, కృష్ణారావు, లక్ష్మినరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ విజయంపై బీజేపీ నాయకుల సంబరాలు


ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఆనందం వ్యక్తంచేస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు బీజేపీ పాలనే కోరుకుంటున్నారని ఇందుకు ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల ఫలితాలు నిదర్శనమని ఆ పార్టీ సీనియర్ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద గెలుపు సంబరాలను నిర్వహించారు. సందిరెడ్డి శ్రీనివాసులతోపాటు నాయకులు కిరణ్ గౌడ్, దుద్దకుంట వెంకటేశ్వర‌రెడ్డి, చిరంజీవిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, శాంతకుమార్, నాగేంద్ర, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య శ్రీ వర్తించని వారికి సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆమె శనివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గంలోని ఐదుగురికి రూ.3,02,972 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వారు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

మహా కుంభాభిషేకం పోస్టర్ల విడుదల

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే మహా కుంభాభిషేకం పోస్టర్లను నగర మేయర్ మహమ్మద్ వసీం, ఆలయ కమిటీ ప్రధాన అర్చకుడు హరికిషోర్ శనివారం ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ... ఆలయానికి అనంతమైన దైవికశక్తిని పెంపొందించే మహిమాన్వితమైన మహా కుంభాభిషేకాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ కోశాధికారి తాళంకి వెంకటేశ్వర్ గుప్త పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

శింగనమల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12వ త వరకు గడువు పెంచినట్లు ఎంపీడీఓ భాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు..

అక్షర ఇంటర్నేషనల్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభా విద్యార్థులను సత్కరిస్తున్న ఏజీఎన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

గార్లదిన్నె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సంవత్సరం ఎన్ఎస్ఎస్ సంస్థ నిర్వహించే లైవిన్ఏ స్పేష్ కాంటెస్ట్‌లో ఈ ఏడాది స్థానిక అక్షర ఇంటర్నేషనల్ స్కూల్లో తొమ్మిది తరగతి చదువుతున్న విద్యార్థులు పోలార్ హెవిన్ ప్రాజెక్టు చేశారు. ఇందుకు ఎన్ఎస్ఎస్ సంస్థ విద్యార్థుల ప్రతిభ గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో మూడో స్థానం కల్పించింది. దీంతో ఆ పాఠశాల ఏజీఎన్ రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరచిన తొమ్మిది మంది విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేష్, కో ఆర్డినేటర్ సాధిక్‌వలి, డీన్‌లు పోతులయ్య, జుల్ఫదన్, జగదీష్, ఏఓ బాబు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పేరుతో రద్దు చేస్తే... ఉద్యమిస్తాం

● ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పేరుతో వేలాది పాఠశాలలను రద్దు చేయాలని నిర్ణయించడం తగదని, ఇదే జరిగితే ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం పూర్వపు రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ... ప్రభుత్వం తక్షణమే స్పందించి మోడల్ ప్రైమరీ పాఠశాలలు కాకుండా, 117 జీవోను కూడా రద్దు చేసి దానికి మునుపు ఉన్న విద్యావిధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, నరేష్‌కుమాంర్, ఇతర నాయకులు సర్దార్‌వలి, వెంకటరమణ, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో శనివారం రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య, రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు లక్ష్మీపతిరాజు, కార్యదర్శి రాంప్రసాద్ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. 30ఏళ్ల నుంచి ఆపై వయస్సున్న మహిళలు, పురుషులు వేర్వేరుగా పరుగు, స్పీడ్‌వాక్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 300, 400మీటర్ల వాక్, 3కె రన్, 5కె రన్, జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధన కోసం నగరంలోని సప్తగిరి సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీనాక్షమ్మ ఫౌండేషన్ వ్యవ స్థాపకులు రవికాంత్ రమణ, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, మా కార్యనిర్వాహక కార్యదర్శి ఇంజనీరు సుధాకర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సికిందర్, కార్యదర్శి లోకనాథ్, సభ్యులు రొళ్ళ భాస్కర్, సుంకర రమేష్, నాగశివ, సతీష్, నందిత తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై శ్రీవారి విహారం


శేష వాహనంపై విహరిస్తున్న స్వామి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండమీద రాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నాలుగో రోజు శనివారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీప కాంతులతో మంగళవా యిద్యాల నడుమ మధ్య స్వామి వారి ఊరేగింపు శోభాయమానంగా సాగింది. శేషవాహన సేవకు ముందుగా స్థానిక అంజనేయ స్వామి దేవాలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పల్లకి సేవ నిర్వహించారు. సాయంత్రం స్థానిక లక్ష్మీనారాయణస్వామి దేవాలయం లో ఉత్సవమూర్తులను శేషవాహనంపై ఆశీనులను చేసి పురవీదుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు మొక్కారు. స్వామి వారు ఆదివారం హనుమద్వాహనంపై విహరించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

సమష్టిగా పనిచేద్దాం: కమిషనర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేస్తేనే అభివృద్ధి దిశగా ముందుకెళ్తామని నగర కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఆయన శనివారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. విధి నిర్వహణ విషయంలో అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. త్వరలో నిర్వహించనున్న 2025-26 బడ్జెట్ సమావేశానికి అందరూ సిద్ధం కావాలన్నారు. అందులో భాగంగా 2024-25 సవరణలు, 2025-26 సంవత్సరం బడ్జెట్‌కు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతకుముందు నగరంలోని పలు కాలనీల్లో పారిశుధ్య పనులను, అన్న క్యాంటీన్లలో ఆహారం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరవకొమ్మ కనుమరుగు కాకుండా చూడండి

● హైవే అధికారులకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సూచన


హైవే అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): జాతీయ అరు వరుసల రోడ్డు నుంచి శింగనమల మరవ కొమ్మ రోడ్డు కను మరుగు కాకుండా చూడాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆమె శనివారం అనంత పురంలోని తన క్యాంపు కార్యాలయంలో జాతీయ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. శింగనమల మరవకొమ్మ రోడ్డుకు అనుసంధానం చేసే క్రమంలో హైవే రోడ్డులో అండర్ పాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులను తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, నేషనల్ హైవే అధికారులు శివకుమార్, సర్వేయర్ స్టీఫెన్ వీరాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అలంకారాయునిపేట సందర్శన

శింగనమల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆలంకరాయునిపేటలో అధికారులు రెండు రోజులు పరిశీలించారు. గత నెల 6న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తన సొంతూరు ఆలంకరాయునిపేటలో సమస్యలను పరిష్కారించాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అర్జీ ఇచ్చారు. అలాగే జనవరి 8న ఆంధ్రజ్యోతిలో అవస్థలే అలంకరణ అనే కథనం రావడంతో కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించారు. వారి ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ భాస్కర్, ఈఓపీఆర్డీ వెంకట లక్ష్మి, ఏపీఓ శ్రీదేవి ఇతర అధికారులు రెండు రోజులు గ్రామంలో పరిశీ లించారు. పలు సమస్యలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

200 'ఉపాధి' పనిదినాలు కల్పించాలి

● ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ఏడాదికి 200పనిదినాలు కల్పించి, రోజుకు కనీస వేతనం రూ.700 చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో కేశవరెడ్డి మాట్లాడారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24వ తేదీన రాజధాని అమరావతిలో ఉన్న కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (సీఆర్డీ) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

● నెహ్రూ యువ కేంద్రం అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో పాల్గొనాలని, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని నెహ్రూ యువ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో శనివారం యూత్ క్రీడాక్లబ్‌ల సమావేశం నిర్వహించారు. హరీష్ కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఛైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ చేతులమీదుగా యూత్ క్లబ్‌లకు క్రీడా సామగ్రి అందజేశారు. యువతీ, యువకులకు ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేశారు. నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సత్య సౌమ్య, లహరి, యువజన జాగృతి సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవాలను విజయవంతం చేయండి

● కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా


పోస్టర్లు విడుదల చేస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో ఈ నెల 14, 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న అనంత బాలోత్సవంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా పిలుపునిచ్చారు. నగరంలోని క్రిసెంట్ స్కూల్‌లో శనివారం అనంత పిల్లల పండుగ-5 పోస్టర్లను షమీమ్ షఫీవుల్లా చేతుల మీదుగా ఆవిష్కరించారు. బాలోత్సవ కమిటీ కార్యనిర్వా హక కార్యదర్శి సావిత్రి, సభ్యులు డాక్టర్ ప్రసూన, ఏజీ రాజమోహన్, చంద్ర కళ, రామాంజినమ్మ, ఓబూరు పరమేష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైల్వే డీజిల్ షెడ్డు తనిఖీ

గుత్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే డీజిల్ షెడ్‌ను గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే వెబ్‌టెక్ ఇంజన్‌కు సంబంధించి లోడ్ బాక్స్‌ను ప్రారంభించారు. అనంతరం అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి షెడ్డు అభివృద్ధిపై చర్చించారు. తర్వాత రైల్వే ఆస్పత్రిని సందర్శించారు. కార్యక్రమంలో డీజిల్ షెడ్డు సీనియర్ డీఎంఈ ప్రమోద్, ఏడీఎంఈ సుంకన్న, ఎస్ఎంఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు మనోజ్, ప్రభుదాస్, రైల్వే ఆస్పత్రి వైద్యులు విజయలక్ష్మి, వెంకటేశ్వరావు, రైల్వేకార్మిక సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

గుత్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో దక్షిణ కొరియా పూసాన్ యూనివర్శిటీ వారు రీసెడ్ అడ్వాన్సెస్ ఇన్ నావెల్ డ్రగ్ డెలివరీ అనే అంశంపై ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆన్‌లైన్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం విజయవంతంగా ముగిసింది. ఈసందర్భంగా పుసాన్ యూనివర్శిటీ పాలిమర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఇల్డోచుంగ్ పాల్గొని ప్రసంగించారు. ఈ పాలిమర్ డ్రగ్ అనే నూతన విధానం ద్వారా క్యాన్సర్ టిష్యూ, ఇంజనీరింగ్ పిన్ ట్రాక్‌టిక్ క్యాన్సర్లపై సమగ్ర చికిత్స చేయవచ్చునని పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ ప్రోగ్రాంకు దాదాపు 300పైగా అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, విభాగాధిపతి హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొన్న బస్సు .. ముగ్గురికి గాయాలు

కూడేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవకూరు గ్రామ సమీపంలో శనివారం ముందు వెళ్తున్న ఆటోను కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీ కొంది. దీంతో ఆటోలో వెళ్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఉరవకొండ మండల అమిద్యాల గ్రామానికి చెందిన పద్మావతి, ఎర్రిస్వామి, స్రవంతితో పాటు డ్రైవర్ గోపాల్ ఆటోలో అనంతపురానికి బయలుదేరారు. కాగా అరవకూరు గ్రామం వద్దకు రాగానే వెనుకవైపున వేగంగా వస్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ప్రమాదంలో పద్మావతితోపాటు డ్రైవర్ గోపాల్, ఎర్రిస్వామికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వీరిని వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు

కూడేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడదరకుంట గ్రామంలో బాల్య వివా హం చేయనున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు, అప్రమత్తమై శనివారం ఆ గ్రామాన్ని సందర్శించారు. సదరు బాలిక కుటుంబ సభ్యులతో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, సర్పంచ్ లలితమ్మ, పోలీసులు, ఇతర అధికారులు చర్చించారు. బాల్య వివాహం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. బాల్యవివాహానికి ప్రోత్సహించిన వారికి కూడా కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. అయితే తాము ఎటువంటి వివాహం గూర్చి చర్చించ లేదని, అదంతా ఒట్టి ప్రచారమేనని బాలిక కుటుంబసభ్యులు అధికారులకు తెలిపారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా సూర్యనారాయణ

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్‌గా గోళ్ల సూర్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రంగయ్య నుంచి నియామకపత్రం అందుకున్నట్లు శనివారం ఆయన ప్రకటనలో తెలిపారు. తనను గుర్తించినందుకు అధినేత వైఎస్ జగన్‌కు, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చీనీ చెట్లకు నిప్పు

కూడేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుట్ల 2వ కాలనీలో శ్రీనివాసులనాయుడుకు చెందిన చీనీ తోటకు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పలు చెట్లతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయని బాధితుడు శనివారం తెలిపారు. దాదాపు రూ. 5లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

మంత్రి చొరవతోనే నిధులు మంజూరు

ఉరవకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతోనే నిధులు మంజూరయ్యాయని టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14, 15వ తేదీల్లో గుత్తి సమీపంలోఉన్న సేవాఘడ్‌లో జరిగే సేవాలాల్ జయంతి ఉత్సవాల కోసం రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఎస్టీల పట్ల చిత్తశుద్ధి ఉందని నిరూపించుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఎస్టీలకు ఖర్చు చేయాల్సిన నిధులను పక్క దారి మళ్లించిందని ఆరోపించారు. ఎస్టీ సెల్ నాయకులు నారాయణస్వామి, వెంకటేష్ నాయక్, కాలేనాయక్ పాల్గొన్నారు.

రెండు చెరువులకు హంద్రీనీవా నీరు విడుదల

బెళుగుప్ప, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శీర్పి, బెళుగుప్ప చెరువులకు రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో శనివారం హంద్రీనీవా నీరు వదలినట్లు టీడీపీ మండల కన్వీనర్ ప్రసాద్, మాజీ వైఎస్ఎంపీపీ తిమ్మప్ప శ్రీనాథ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ రామసుబ్బయ్య ఇంజనీర్ పృథ్వీ మాట్లాడుతూ.. 36వ ప్యాకేజీ 11వ ఎత్తిపోతల పథకం నుంచి ఆ రెండు చెరువులకు నీరు విడుదల చేశామన్నారు. మొదట శీర్పి చెరువును నింపి తర్వాత బెళుగుప్ప చెరువుకు వదులుతామని చెప్పారు.

ఘనంగా పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలు

● సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన బుల్లితెర హాస్య నటులు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, దేవస్థానం చైర్మన్ దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను పెద్దఎత్తున చేపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి బుల్లితెర హాస్యనటులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపజేశారు. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా హాజరై తిలకించారు. బుల్లితెర నటులు పలు ఆధ్యాత్మిక, హాస్య నాటికలు నిర్వహించి అలరించారు. డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



బుల్లితెర నటులకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

శిథిలావస్థలో తాగునీటి ట్యాంకు

● పొంచి ఉన్న ప్రమాదం
● భయాందోళనలో స్థానికులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామీణ తాగునీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలి, ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో సమీప ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. స్థానిక వినాయక గుడి సమీపంలో 1982లో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ప్రభుత్వం గ్రామీణ తాగునీటి పథకం కింద ట్యాంకు నిర్మించింది. 40 ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. ట్యాంకు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు వచ్చి తుప్పుపట్టాయి. కూలడానికి సిద్ధంగా ఉంది. గాలికాలం వచ్చిందంటే ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత ట్యాంకును కూల్చి, కొత్తగా నిర్మించాలని కోరుతున్నారు.



పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్న ట్యాంకు పిల్లర్లు



శిథిలమైన తాగునీటి ట్యాంకు

ఎప్పుడు కూలుతుందోనని భయమేస్తోంది..



ట్యాంకు పెచ్చులూడింది. పిల్లర్లకడ్డీలు బయటకు వచ్చి తుప్పు పడుతున్నాయి. గాలికాలం వచ్చిందంటే ఎక్కడ కూలుతుందోనన్న భయమేస్తోంది. బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నాం.

- ఫకృద్దీన్, స్థానికుడు

50 ఏళ్లు దాటాలి..

ట్యాంకు నిర్మించిన 50 ఏళ్ల వరకు కాలపరిమితి ఉంటుంది. ఇంకా సమయం ఉంది. పెచ్చులూడి పిల్లర్లన్నీ శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, బెళుగుప్ప

ఘనంగా భీష్మ ఏకాదశి



పూలచెర్లలో భీష్ముడి చిత్రపటం ఊరేగింపు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశిని పట్టణంలోని బెస్తకాలనీలో శనివారం బెస్త సేవా సంఘం వారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గంగమ్మ ఆలయం వద్ద భీష్ముడి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. కురు వంశంలో భీష్ముడు పరాక్రమశాలిగా, గొప్ప యోధుడిగా కొనియాడారు. ఆయనను ధర్మానికి చిహ్నంగా భావిస్తారని అన్నారు.

పామిడి: పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి(తగ్గుదేవాలయం) ఆలయం, రంగసుబే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో మూల విరాట్‌లకు అభిషేకాలు, అలంకరణలు, విశేష పూజలు చేపట్టారు.

తాడిపత్రి: పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉన్న బెస్తసంఘం కార్యాలయంలో బెస్తసేవా సంఘం నాయకులు భీష్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. బెస్తసేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడుబాలసుబ్రమణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

యాడికి: భీష్మఏకాదశిని పురస్కరించుకుని మండలకేంద్రంలోని భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు శివలింగానికి అభిషేకం, అర్చనలు, పూజలు నిర్వహించారు. తర్వాత శివపార్వతుల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే భైరవలింగేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిపారు.

కణేకల్లు: మండలంలోని పూలచెర్ల గ్రామానికి చెందిన బెస్త కులస్థులు భీష్ముడి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పెద్దఎత్తున మహిళలు హారతులు పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.

ఢిల్లీ గెలుపుపై బీజేపీ సంబరాలు



తాడిపత్రిలో సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు

తాడిపత్రి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడంతో పట్టణంలోని ఆ పార్టీ నాయకులు శనివారం సంబరాలు చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సర్కిల్‌లో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. నాయకులు శింగరి లక్ష్మీనారాయణ, గంగాధర్ మాట్లాడుతూ దాదాపు 26ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీల అరాచకాలకు అక్కడి ప్రజలు చరమగీతం పాడారన్నారు. నాయకులు రంగనాథరెడ్డి, శ్రీరంగయ్య, రామాంజనేయులు, పృథ్వీరాజ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలో బీజేపీ నాయకులు స్థానిక ఇల్లూరు లక్ష్మీనారాయణ భవనం నుంచి పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. నాయకులు వడ్డెరమేష్, వాసం రవిబాబు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: పట్టణంలోని బీజేపీ నాయకులు స్థానిక శాంతినగర్ వద్దవున్న పార్టీ కార్యాలయం వినాయకసర్కిల్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధర, నాయకులు పాల్గొన్నారు.

పుట్లూరు రోడ్డులో ఎమ్మెల్యే పర్యటన



పుట్లూరు రోడ్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి దుకాణాల నిర్వాహకులతో, ప్రజలతో మాట్లాడుతూ.. సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే తమ దృష్టికి తేవాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని కోరారు. కాలనీల్లో డ్రైనేజీ సమస్యపై పలువురు తెలపగా... స్పందించిన ఆయన వెంటనే మున్సిపల్ అధికారులను పిలిపించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కొన్నిచోట్ల విద్యుత్‌లైట్లు లేవని తెలపడంతో.. ఆ సమస్యనూ పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొందరు వృద్ధులను పలకరిస్తూ.. మీకు పింఛన్ సమయానికి అందుతోందా.. అంటూ ఆరా తీశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి, విజ్జి, మధు, ఖాదర్, రంగనాథరెడ్డి, హరినాథరెడ్డి, పవన్ తదితరులు ఉన్నారు.

సీఐ దాతృత్వం

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ అనాథ వృద్ధుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఆచూకీ కోసం కొందరు అతడి ఫొటోను సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. విషయం మృతుడి భార్య గంగమ్మకు తెలియడంతో ఆమె శనివారం రాయదుర్గానికి వచ్చి భర్త శవాన్ని తన సొంతూరు బళ్లారికి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. అయితే ఆర్థిక స్తోమత లేదని పోలీసుల ఎదుట వాపోయింది. చలించిన అర్బన్ సీఐ జయనాయక్ సిబ్బంది సాయంతో అంబులెన్స్ సమకూర్చారు. అలాగే అంత్యక్రియలకు రూ.5వేలు ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు.

చాలవేములలో చోరీ

పుట్లూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేముల గ్రామంలో ఈశ్వరమ్మ అనే మహిళ ఇం ట్లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈశ్వరమ్మ ఈ నెల 6వ తేదీన రూ.45వేల నగదును ఇంటిలోని బీరువాలో పెట్టారు. అయితే శనివారం డబ్బుతో అవసరం వచ్చి బీరువా తెరచి చూడగా నగదు కనిపించలేదు. ఈ మేరకు ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

ఐదు టిప్పర్లు సీజ్

పుట్లూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేముల గ్రామ శివారులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఐదు టిప్పర్లను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు. టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నామని అన్నారు. అనంతరం వాటిని సీజ్‌చేసి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

నేడు ఘంటసాల గానలహరి

తాడిపత్రి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మధుర గాయకుడు ఘంటసాల 51వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఘంటసాల గానలహరి నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మురుగన్ బాలు శనివారం తెలిపారు. పెద్దఎత్తున అభిమానులు, సంగీత ప్రియులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



మారుతీ ప్రసాద్

కూడేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమ్మూరు గ్రామానికి చెందిన మారుతీ ప్రసాద్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఆయన శుక్రవారం ఉదయం తోట వద్దకు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అనంతరం తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో అతడి భార్య రామేశ్వరమ శనివారం తమకు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

అసభ్యంగా మాట్లాడారు..

● వీఆర్వోపై సోషల్‌మీడియాలో పోస్టు

తాడిపత్రి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 35వ వార్డులో నివాసం ఉంటున్న ఓ మహిళ తన కుమార్తెను ఓ వీఆర్వో అసభ్యంగా మాట్లాడాడని సోషల్‌మీడియాలో వైరల్ చేసింది. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే వీఆర్వో తన కుమార్తె పట్ల అసభ్యంగా మాట్లాడాడని వాపోతూ ఆమె పోస్టును పెట్టింది. ఆ వీర్వోపై చర్యలు తీసుకోవాలని కోరింది. దీనిపై తహసీల్దార్ రజాక్‌వలిని వివరణ కోరగా.. ఆర్డీఓ దృష్టికి తీసుకెళతామని, విచారణ చేపట్టిన తర్వాత సదరు విఆర్వోపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విషపూరిత నీరు తాగి 30 జీవాల మృతి

బెళుగుప్ప, ఫిబ్రవరి 8 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి తండాలో నాగరాజు నాయక్, చంద్రనాయక్‌కు చెందిన 30 మూగజీవాలు శనివారం విషపూరిత నీరు తాగి మృతి చెందాయి. పశువైద్యాధికారి రమేష్‌బాబు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బాధితులు గొర్రెలు, మేకలను మేత కోసం సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లారు. కాగా అక్కడ మొక్కజొన్న తోటలో తెగుళ్ల నివారణకు పిచికారీ చేసేందుకు రసాయనిక మందులను నీటిలో కలిపి ఉంచారు. మేత మేసిన జీవాలు అక్కడే ఉన్న ఆ నీటిని తాగి మృతి చెందాయి. వాటిని పరిశీలించి వైద్య పరీక్షలు చేశామని, నాగరాజు నాయక్‌కు చెందిన 19 మేకలు, ఒక గొర్రె, చంద్రనాయక్‌కు చెందిన పది గొర్రెలు, మేకలు మృతి చెందాయని పశువైద్యాధికారి తెలిపారు. దీంతో రూ. మూడు లక్షలకు పైగా నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

ఉద్దేశపూర్వకంగానే తాగునీరు విషపూరితం

పాత కక్షలను దృష్టిలో వుంచుకుని ఉద్దేశ పూర్వకంగానే తాగునీటిలో క్రిమిసంహారక మందు కలిపి విషపూరితం చేశారంటూ బ్రాహ్మణపల్లి తండాలో రైతు అనిల్‌పై గొర్రెల యజమానులు చంద్ర నాయక్, నాగరాజు నాయక్ పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

నాముగొని 31గొర్రెలు..

తాడిపత్రి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వెంకటాంపల్లి గ్రామంలో జొన్న మొక్క తిని 31గొర్రెలు మృతి చెందాయి. కాపరులు సంజీవ య్య, రామాంజనేయులు, గోపాల్, గంగశేఖర్, నరసింహయ్య, ఓబులేసుకు చెందిన గొర్రెలు శనివారం ఉదయం మేతకు వెళ్లి సాయంత్రం తిరిగి మందకు చేరుకున్నాయి. అప్పటి వరకు బాగానే ఉన్న జీవాలు కొద్దిసేపటికి స్పృహతప్పి పడిపోయాయి. కాపరులు వెంటనే పశువైద్యాధికారి సుబ్బారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పరిశీలించి చనిపోయాయని తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి జొన్నమొక్క తినడంతో నాముగొని మృతి చెందాయని స్పష్టం చేశారు. దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు.

స్కూల్ బస్సుల కండీషన్‌పై శ్రద్ధ చూపాలి: ఎస్ఎఫ్ఐ

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల కోసం వినియోగిస్తున్న బస్సుల కండీషన్లపై సంబంధిత అధికారులు శ్రద్ధపెట్టాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కండీషన్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. వెంటనే అధికారులు వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు భరత్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్చీపై ఆశావహుల దృష్టి

● ఓసీ జనరల్‌కు కేటాయించడంతో తీవ్ర పోటీ

ఉరవకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మార్కెట్ కమిటీ చెర్మన్ పదవిని ఓసీ జనరల్‌కు రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో టీడీపీలోని ఓసీ నేతల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. గత 20ఏళ్ల నుంచి చైర్మన్ పదవి బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారికే దక్కుతూ వస్తోంది. ఇప్పుడు ఓసీ జనరల్‌కు కేటాయించడంతో కుర్చీ కోసం తీవ్ర పోటీ నెలకొంది. నియోజకవర్గ స్థాయిలో ఎంఎల్‌ఏ తర్వాత అంత ప్రాధాన్యత ఉన్న పదవి ఇదే. ఈ ప్రాంతం వ్యవసాయాధారితం కావడంతో ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని నేతలు పదవి కోసం పోటీ పడుతున్నారు. ప్రధానంగా ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాలకు చెందిన నాయకులే ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే అధికసంఖ్యలో ఉండడంతో , ఓసీ జనరల్ అయినా బీసీ వర్గాలకు కూడా పదవి దక్కవచ్చునన్న చర్చ జరుగుతోంది.



మార్కెట్ యార్డు ముఖద్వారం

నేమకల్లు ఆంజనేయుడికి విశేషపూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు సుప్రభాత సేవ చేశారు. అనంతరం మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి అష్టోత్తర పూజలను జరిపారు. తర్వాత కుంకుమార్చనలు చేసి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శేషవాహనంపై బొలికొండ రంగనాథుడు



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయమే ఆలయంలో మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి సమయంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై కొలువు దీర్చి మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం చిన్న రథంపై కొలువుదీర్చి సమీపంలోని జమ్మిచెట్టు వరకు లాగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీమాతకు పల్లకి సేవ



అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గోవిందవాడ గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా జరుగుతున్న వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహప్రతిష్ఠా పనోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజున అమ్మవారికి పల్లకీ సేవను నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు ఆలయంలో వాసవీమాతతో పాటు పరిహార దేవతలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, అష్టోత్తర సహస్రనామ పూజలను జరిపారు. తర్వాత వాసవీమాత ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగించి.. మహామంగళహారతి ఇచ్చి పూజలను ముగించారు. భక్తులకు అన్నప్రసాదవితరణ జరిగింది.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గుత్తిరూరల్ ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాంలో శనివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు వేకువజామున ఆలయంలో హోమాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని వేదమంత్రాల నడుమ, శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పెన్నహోబిళం స్వామికి ప్రత్యేక పూజలు

ఉరవకొండ,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మాఘమాసం సందర్భంగా మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి విశేష పూజల్ని జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువు దీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా వన్నూరు స్వామి ఉరుసు

కణేకల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రవడికి గ్రామంలో వన్నూరుస్వామి ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని చక్కెర చదివింపులు చేయించారు. నిర్వాహకులు స్వామి వారి సవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కుమారుడు కాలవ భరత్ హాజరయ్యారు. ఆయన్ను స్థానిక టీడీపీ నాయకులు హనమంతప్ప,రఘునాథ్‌రెడ్డి, ఎర్రిస్వామి తదితరులు ఘనంగా సన్మానించారు.

వెంకటరమణస్వామికి ప్రత్యేక పూజలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిగుమ్మలో వెలిసిన వెంకట రమణ స్వామి, పద్మావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. మాఘమాసం రెండో శనివారం సందర్భంగా అర్చకులు వేకుజామునే గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, తమలపాకుల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రాయలచెరువు పీహెచ్‌సీ తనిఖీ

యాడికి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని అడిషనల్ డీఎం హెచ్‌ఓ డాక్టర్ అనుపమ జేమ్స్ శనివారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా కుష్ఠ, క్షయ వ్యాధులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సిబ్బందితో మాట్లాడుతూ.. కుష్ఠ వ్యాధిగ్రస్థులకు ఇంటివద్దకే ఆశా కార్యకర్తల ద్వారా మందులు అందజేయాలని చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహించే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అంతా సమష్టిగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ దేవరాజన్, పీహెచ్ఎన్ సుమతిదేవి, డీపీఎంఓ రామచంద్ర, సూపర్‌వైజర్ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కోచింగ్ కేంద్రం ప్రారంభం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను టూటౌన్, రూరల్ సీఐలు మస్తాన్, ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీనివాసులు శనివారం ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ ఉచిత కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పట్టణంలోని తననివాసంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారుకు అందజేశారు. కణేకల్లు క్రాసింగ్‌కు చెందిన పాలేగార్ రవీంద్రకు గుండెసంబంధిత శస్త్రచికిత్స కోసం 92,573 రూపాయలు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైంది. దీంతో అందుకు సంబంధించిన చెక్కును ఆయన కుమారుడు సందీప్‌కు కాలవ అందజేశారు.